| ప్రాంతం | నెల్లూరు | కావలి | ఆత్మకూరు | ఉదయగిరి | కందుకూరు |
|---|---|---|---|---|---|
| గరిష్ఠం | 38.3 | 36.0 | 41.0 | 42.0 | 38.0 |
| కనిష్ఠం | 26.2 | 26.0 | 26.0 | 25.0 | 27.0 |

## సోమశిలలో 8.381 టీఎంసీల నిల్వ

**అనంతసాగరం:** సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 8.381 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



# ఇసుకాసురా..!

● యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ ● నాలుగేళ్లలో రూ.1500 కోట్ల పైమాటే! ● కొండలా పెరిగిపోయిన వైసీపీ నేతల ఆస్తులు

తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు!
- ఇది భర్తృహరి సుభాషితం-2లోని తొలి పంక్తి. ప్రయత్నం చేయడం వల్ల ఇసుక నుంచి తైలం (నూనె) తీయవచ్చును అనేది దీని భావం.

పాపం భర్తృహరి ఏ ఉద్దేశంతో ఈమాట చెప్పారో తెలియదు కానీ ఆయన పుట్టిన భరతఖండంలో పుట్టిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాత్రం అసాధ్యమనుకున్న పనిని చేసి చూపించారు. ఇసుక నుంచి నూనె కాదు కదా..! ఏకంగా టిప్పర్ల కొద్దీ ప్రజల నెత్తుటి కష్టాన్ని పిండి చూపించారు. కొత్త ఇసుక పాలసీ పేరుతో వేలాది కార్మిక కుటుంబాలను ఆకలితో అల్లాడించారు. హిందూ సంస్కృతిలో భాగంగా ప్రేమగా పెంచుకున్న జుట్టుపై తుగ్లక్ పాలనలో పన్ను వేశారని చరిత్ర చెబుతుంటే ఈ వైసీపీ ప్రభుత్వం అంతకన్నా ఘోరంగా ఊరి పక్కన ఉన్న ఏట్లో ఇసుక కోసం ప్రజల నుంచి వందల వేల కోట్లు కొల్లగొట్టడం ద్వారా పాలనా విధానంలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇసుక పాలసీ పేరుతో వైసీపీ నాయకుల ఆస్తులు కొండల్లా పెంచుకున్నారు. భూగర్భ జలాలకు ఆధారమైన నదులు, వాగులు, వంకలను కుళ్లబొడిచి సహజ వనరులను కొల్లగొట్టారు. ఇసుక పాలసీ పేరుతో జిల్లా ప్రజలను పిండుకున్న మొత్తం ఎంతో లెక్కగడితే కడుపు రగిలిపోతుంది. ఇసుక ధర రూపంలో వసూళ్లు చేసుకున్న మొత్తం అక్షరాల వెయ్యి కోట్లకు పైమాటే. అధికారిక లెక్కల ప్రకారమే నాలుగేళ్లలో 600 కోట్లు ఇసుక ధర రూపంలో ప్రజల నుంచి పిండుకున్నారు. వాస్తవానికి ఇంతకు నాలుగు రెట్లు అదనంగా తవ్వకాలు జరిపి వేల కోట్లు పోగేసుకున్నారు.

### ఆకలి.. ఆకలి.. ఆకలి...



వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీలో ఎటు చూసినా ఆకలే కనిపిస్తుండటం విశేషం. ఇసుక ధర నిర్ణయించి గుత్తేదారులకు కేటాయించడంలో ప్రభుత్వం ఆకలి కనిపిస్తోంది. ఇసుక డబ్బులతో ఖజానాను ఎంతో కొంత నింపుకోవచ్చని ప్రభుత్వం ఆశించింది. సహజ వనరైన ఇసుకను రాష్ట్రవ్యాప్తంగా గంపగుత్తగా ఒకరికి ధారాదత్తం చేయడం ద్వారా వేల కోట్లు తమ వ్యక్తిగత ఖాతాలోకి జమ చేసుకోవచ్చనే ప్రభుత్వ పెద్దల ఆకలి ప్రజలందరికీ అర్థమైంది. ఆ తరువాత కాంట్రాక్టర్ల ఆకలి కనిపిస్తోంది. మేతగా నేతకు ఇంత వేశాం.. మరి అంతకు పదిరెట్లుగా మనవాటా ఉండాలిగా అన్నట్లు ప్రభుత్వానికి టన్ను ఇసుకకు డబ్బులు కట్టి అనధికారికంగా పది టన్నుల ఇసుక అమ్మేసుకున్నారు. ఆ తరువాత జిల్లా వైసీపీ నాయకుల ఆకలి. బాస్ తింటున్నాడు. ఎక్కడి నుంచో వచ్చిన (కాంట్రాక్టర్లు) బేవకూఫ్‌లు తింటున్నారు. ఇక్కడున్న మేమేం తక్కువా అంటూ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు అనధికారిక రీచ్‌లపై విరుచుకుపడ్డారు. ప్రధాన కాంట్రాక్టరు అడ్డుపడినా, స్థానిక ప్రజలు అడ్డగించినా లెక్కచేయక ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దించి రేయింబవళ్లు తేడా లేకుండా చిన్న సైజు వాగులు, వంకలను మింగేశారు. స్టాక్ పాయింట్లలో ఇసుక కొండలు ఉన్నట్లు, అక్రమ తవ్వకాల ద్వారా వైసీపీ నాయకులు తమ ఆదాయాన్ని కొండల్లా పెంచుకున్నారు. చిట్టచివరిది భవన నిర్మాణ కార్మికుల ఆకలి. కొత్త ఇసుక పాలసీ రూపంలో ప్రభుత్వం దాదాపు ఆరేడు నెలల పాటు ఇసుక దొరకని పరిస్థితి తెచ్చింది. దానికి ముందు ఏడాది కాలం పాటు కరోనా కాటుకు గురై పనులు దొరకని పరిస్థితిని ఎదుర్కొంటే ఆ తరువాత ఆరేడు నెలల పాటు ప్రభుత్వ నిర్లక్ష్య కాటుకు గురై ఉపాధి లేకుండా ఆకలితో అల్లాడిపోయారు.

**నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో అధికారికంగా ఏడు రీచ్‌లు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఏడాదికి 29 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి. ఉదాహరణకు 2022, నవంబరు నుంచి 2023 నవంబరు వరకు పెన్నా బ్యారేజ్ నుంచి 13.11లక్షల మెట్రిక్ టన్నులు, సంగం బ్యారేజ్ నుంచి 12.24 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం కాంట్రాక్టరుకు కేటాయించింది. ఇక మినగల్లు 70,350, పడమటికంపాడు 73,200, ముదివర్తి 72,750, వల్లిపాడు 73200, విరువూరు (పొదలకూరు) 69,750 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగినట్లు అధికారిక లెక్కలు. ఏడాదికి మొత్తం 29లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగినట్లు లెక్క. కరోనా కాలం ఏడాది మినహాయించి నాలుగేళ్ల కాలంలో 1.16 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయన్న మాట.

### అధికారిక లెక్కల ప్రకారం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితం. కానీ వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుకకు రూ.500 ధర నిర్ణయించి వసూళ్లు చేశారు. ఈ లెక్కన నాలుగేళ్ల కాలానికి ప్రభుత్వం రీచ్‌ల వారీగా కాంట్రాక్టరుకు కేటాయించిన ఇసుక పరిమాణం 1.16 కోట్ల మెట్రిక్ టన్నులు. టన్నుకు రూ.500 చొప్పున 1.16కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక కొనుగోలు కోసం ప్రజలు 580 కోట్ల రూపాయలు ఖర్చు చేసుకున్నారు.

### అనధికారికంగా నాలుగురెట్లు ఎక్కువే

అనధికారికంగా ఇంతకు నాలుగు రెట్లు అధికారంగా ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిగాయి. కేటాయించిన రీచ్‌ల్లో ఒక మీటరు లోతుకు మించి తవ్వకాలు జరపకూడదు. ఈ మీటరు లోతు వరకు ఎంత పరిమాణం ఇసుక లభిస్తుందనే లెక్కలు కట్టి ఆ మేరకు ఆ రీచ్‌లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వ కోవచ్చో నిర్దేశిస్తూ కాంట్రాక్టరుకు అప్పగిస్తారు. అయితే జిల్లా పరిధిలో ఏ రీచ్ వద్దకు వెళ్లి చూసినా ఆరు నుంచి ఎనిమిది మీటర్ల లోతు వరకు తవ్వేశారు. భారీ యంత్రాలు ఉపయోగించి ఇష్టారాజ్యంగా పెన్నా నదితో సహా అన్ని రీచ్‌లను కుళ్లబొడిచేశారు. మైనింగ్‌శాఖ పరిధిలో పనిచేసే కాస్త నిజాయితీ పరులైన అధికారుల సమాచారం ప్రకారం దాదాపుగా ప్రతి రీచ్ పరిధిలో కేటాయించిన ఇసుక కన్నా నాలుగైదు రెట్లు అధి కంగా తవ్వి అమ్ముకున్నట్లు చెబుతున్నారు. అంటే ఇసుక కాంట్రాక్టర్లు ప్రజల నుంచి టన్నుకు రూ.500 చొప్పున ఈ నాలుగేళ్లలో రూ.1500 కోట్లకు పైగానే పిండు కున్నారు.



సంగం : పెన్నానదిలో ఇసుక తవ్వేందుకు ఉన్న భారీ యంత్రాలు (ఫైల్)

● తెలుగుదేశం ప్రభుత్వంలో నెల్లూరు నగరానికి ట్రాక్టరు ఇసుక 1200 నుంచి 1800 రూపాయలకు తోలేవారు. ఇప్పుడు రూ.4వేల నుంచి 5వేలు అయ్యింది. అప్పటికి ఇప్పటికి ట్రాక్టరు బాడుగ ఏం పెరగలేదు. టన్నుకు రూ.500 చొప్పున ప్రభుత్వం వసూలు చేసే మొత్తం ఒక ట్రాక్టరుపై 3వేల రూపాయల వరకు అవుతోంది.

### ఇసుక ధర రెండింతలు పెరిగింది



గత టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ఉచితం కావడంతో వెయ్యి రూపాయలకే ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేది. పక్క గ్రామాలకు రూ.1500లకే చేరేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రీచ్‌లో నుంచి ట్రాక్టర్ బయటకు రావాలంటే రూ.2800, పక్క గ్రామాలకైతే రూ.3500 నుంచి 5వేలు ధర పలుకుతోంది. ఈ ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టేలా లేదు. సిమెంట్ కంటే ఇసుకకు ఖర్చు ఎక్కువ అవుతోంది. చెప్పాలంటే ఇంటి నిర్మాణ బడ్జెట్‌లో సగం ఇసుకకే. దీంతో నిర్మాణాలు తగ్గిపోయి తాపీ మేస్త్రీలకు చేతి నిండా పనిలేక పట్టణాలకు వలసపోతున్నారు.

- ఖాదర్‌బాషా, తలుపూరుపాడు, సంగం



కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన భారీ ర్యాలీ

## 41 మంది.. 49 సెట్లు

● ఐదో రోజూ భారీగా నామినేషన్లు

**నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :** పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల జోరు కొనసాగుతోంది. 5వ రోజు మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 41 మంది అభ్యర్థులు 49 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నెల్లూరు ఎంపీ స్థానానికి ఐదుగురు, కందుకూరులో ఏడుగురు, కావలిలో నలుగురు, ఆత్మకూరులో నలుగురు, కోవూరులో ఇద్దరు, నెల్లూరు సిటీలో ఐదుగురు, నెల్లూరు రూరల్‌లో నలుగురు, సర్వేపల్లిలో ముగ్గురు, ఉదయగిరిలో ఏడుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా ఉన్నారు. నెల్లూరు ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా వేణుంబాక సునందరెడ్డి నామినేషన్ వేశారు. కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావు నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా ఇంటూరి సౌజన్య కూడా టీడీపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. నెల్లూరు రూరల్‌లో వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరఫున మరోసెట్ నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా ఉదయగిరిలో సోము అనీల్‌కుమార్, నెల్లూరు రూరల్‌లో షేక్ ఫయాజ్, కందుకూరులో గౌస్ మొహిద్దీన్ నామినేషన్లు వేశారు. వీరితోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.

## రూ.5.81 లక్షల స్వాధీనం

**నెల్లూరు (క్రైం) :** జిల్లావ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.5,81,510 నగదును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు చెక్‌పోస్టులో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఓ టైల్స్ వ్యాపారి నాగరాజు వద్ద రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిన్న బజారు పోలీసు స్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ.1,16,510, దుత్తలూరులో రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్ పరిధిలో 14, సైదాపురం 10, బిట్రగుంట 30, అల్లూరు 13, కొండాపురం 38, కలిగిరి 11, జలదంకి 17, వికె పాడు 18, సంగం 10, కందుకూరు రూరల్ 14, బెల్లపు ఊట 1050, సెబ్ అధికారులు 158 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

## వామ్మో.. గోవా మద్యం!

● కందుకూరులో పట్టుకున్న అధికార బృందం

**కందుకూరు, ఏప్రిల్ 23 :** జిల్లాలో గోవా మద్యం సృష్టించిన కలకలం అంతా ఇంతా కాదు. ఎన్నో కుటుంబాలను చీకట్లోకి నెట్టేసిన ఆ మద్యం ఈ ఎన్నికల్లో మళ్లీ జిల్లాలో ప్రత్యక్షమవుతోంది. మంగళవారం కందుకూరులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 768 మద్యం సీసాలను సీజ్ చేశారు. గోవాకు చెందిన చీప్ లిక్కర్‌ను ఓ కారులో తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో నూతన జాతీయ రహదారి సమీపంలో కాపుకాసి కారుతో సహా మద్యంను సీజ్ చేశారు. అయితే, కారు యజమాని పరారయ్యాడని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.




కారులో ఉన్న మద్యం బస్తాలు

● **మద్యం డంప్‌లపై దృష్టి పెట్టండి : కలెక్టర్**

**నెల్లూరు (హరనాథపురం):** మద్యం అక్రమ డంప్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ మద్యం షాపుల్లో విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ రవాణా జరగ కుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ కొరియర్లతో పాటు నిత్యావసర వస్తువుల బల్క్ లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. జీఎస్టీ అధికారులు వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడు తూ చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, అదనపు ఎస్పీ సౌజన్య, జిల్లా రవాణాశాఖ అధికారి చంద్ర, ఎక్సైజ్ శాఖ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, సెబ్ అధికారి శ్రీధర్, జీఎస్టీ జాయింట్ కమీషనర్ రవీంద్రనాథ్, ఈవీఎం నోడల్ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● **ప్రభుత్వ స్థలాల్లో ఇవి నిషిద్ధం**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, భవనాలు తదితరాలపై ఎన్నికల ప్రచార పోస్టర్లు అతికించడం, జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు నిషిద్ధమని జిల్లా ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు స్థలాలు, భవనాలపై పోస్టర్లు, జెండాల ఏర్పాటుకు వాటి యజమాని నుంచి రాతపూర్వక అనుమతి పొందాలని సూచించారు.

# విభేదాలు వీడిన 'ఇంటూరి'!

- సయోధ్య కుదిర్చిన వీపీఆర్
- రాజేష్‌కు బాబు, లోకేష్‌ల ఫోన్
- రాజకీయ భవిష్యత్తుకు హామీ
- శివరాంకు నాగేశ్వరరావు క్షమాపణలు

**కందుకూరు, ఏప్రిల్ 23 :** నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న వర్గవిభేదాలకు తెరపడింది. రెండు వర్గాలుగా ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఆ పార్టీ యువనాయకుడు ఇంటూరి రాజేష్‌లు చేతులు కలిపారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి పార్టీ నేతలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, చంద్రబాబు సీఎం కావటమే లక్ష్యంగా పార్టీ విజయానికి ఆటంకం కలిగించకూడదన్న ఆలోచనతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనే ఆలోచన మానుకున్నట్లు రాజేష్ ప్రకటించారు.

● **శివరాంకు క్షమాపణ**

మరోవైపు తనను అవమానకరంగా మాట్లాడిన ఇంటూరి నాగేశ్వరరావుకు సహకరించేది లేదన్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా శాంతించారు. వీపీఆర్ ఇంటూరి రాజేష్‌తో కలిసి శివరాం ఇంటికెళ్లి చర్చించటంతో పాటు సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పత్రికాముఖంగా శివరాంకు నాగేశ్వరరావు క్షమాపణ చెప్పారు. ఎప్పటికీ ఆయన గురువు.. నేను శిష్యుడిని.. అన్నట్లే మెలుగుతానని రాజేష్‌తో కలిసి పనిచేస్తానని నాగేశ్వరరావు ప్రకటించారు. దీంతో శివరాం వీపీఆర్ విజయానికి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

● **బాబు, లోకేష్‌ల ఫోన్**

అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌లను రాజేష్‌తో వీపీఆర్ ఫోన్‌లో మాట్లాడించారు. పార్టీ అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఛైర్మన్ పదవి, రెండేళ్ల తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇచ్చేందుకు చంద్రబాబుతో హామీ ఇప్పించారు. అనంతరం లోకేష్ కూడా రాజేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్తును తాము చూసుకుంటామని అభయమిచ్చారు.

● **వర్గ సమస్యకు తెర**

ఈ క్రమంలో కందుకూరులో టీడీపీకి ప్రతిబంధకంగా ఉన్న వర్గ సమస్యకు తెరపడింది. అనంతరం నాగేశ్వరరావు నామినేషన్‌లో పాల్గొన్న వీపీఆర్ మరోసారి తిరిగి రాజేష్ కార్యాలయానికి చేరుకుని అక్కడే భోజనం చేశారు. అక్కడ గంటకుపైగా వివిధ అంశాలపై చర్చించారు. తిరిగి టీడీపీ కార్యాలయానికి చేరుకుని నాగేశ్వర రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాగేశ్వరరావుతో శివరాంకు క్షమాపణ చెప్పించారు. అనంతరం నాగేశ్వరరావును వెంటబెట్టు కుని రాజేష్ వద్దకు వచ్చిన వీపీఆర్ రాజేష్ అనుచరులందరి సమ క్షంలో ఇద్దరితో కరచాలనం చేయించారు. దీంతో కథ సుఖాంతమైంది. ఈ కార్యక్రమంలో దివి రమేష్, చల్లా శ్రీనివాసరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డి సమక్షంలో చేతులు కలిపిన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్





పెద్దూరులో రథాన్ని లాగుతున్న యువత, రథంలో కొలువుదీరిన ఉత్సవర్లు

## వేడుకగా కోదండరాముడి రథోత్సవం

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23 :** బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో సీతా, లక్ష్మణ సమేత కోదండరాముడు మంగళవారం ఉదయం రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలుత ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంలో కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ రథం ముందుకు కదిలింది. తిరిగి రథం యథాస్థానానికి చేరే వరకు భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, పలువురు దాతలు మజ్జిగ, మంచినీరు, అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సీఐ హైమారావు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, రాత్రి శ్రీవారి పుష్కరిణిలో కోదండ రాముడు తెప్పపై విహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ఆత్మకూరు ఉదయగిరి

### పాంచజన్యకు అభినందనలు

**ఉదయగిరి రూరల్:** జీచెర్లోపల్లి కుర్రా పాంచజన్య పదిలో 595 మార్కులు సాధించాడు. కుర్రా కృష్ణయ్య, రమాదేవి తల్లిదండ్రులు. వీరు కుమారుడిని తిరుపతి జిల్లా దొరవారిసత్రం ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాలలోని పది ఫలితాల్లో రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల స్థాయిలో రెండోస్థానంలో నిలవడంతో గ్రామస్థులు విద్యార్థిని అభినందిస్తున్నారు.

### నేటి నుంచి వేసవి సెలవులు

**ఉదయగిరి, ఏప్రిల్ 23:** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు.

# జనం కోసం పనిచేసే నేతలు కావాలి !

- ఉపాధి కల్పనతో పాటు నిజాయితీకి పెద్దపీట
- అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది
- ఎలాంటి నేతలు కావాలో యువ విద్యావంతుల మనోగతం

**సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం కోసం జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన యువ విద్యావంతులు ఎలాంటి ప్రభుత్వం.. ఎలాంటి నేతలు కావాలనుకుంటున్నారో వారి మాటల్లో విందాం..**

\- సంగం

**అవినీతిని నిర్మూలించే నేతనే ఎన్నుకోవాలి : ప్రసాద్, బీటెక్**



పాలనలో పారదర్శకతను చేపట్టి అవినీతిని నిర్మూలించే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాలి. ఐటీరంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించే వారు కావాలి. ప్రభుత్వ శాఖల్లో అవినీతి కి ఆస్కారం లేకుండా చూడాలి. అలాంటి నేతనే ఎన్నుకుంటాం.

**వాగ్దానాలు నెరవేర్చాలి : పెంచల గణేష్, ఎంబీఏ**



నాయకులు ఎన్నికలప్పుడు వచ్చి ఉత్తుత్తి వాగ్దానాలు ఇస్తుంటారు. తీరా గెలిచాక వాటిని పూర్తిగా పట్టించుకోరు. అలా కాకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చే నాయకులు కావాలి.

**ప్రజల కోసం పనిచేయాలి : విజయ్, డిగ్రీ**



ప్రతి గ్రామంలోకి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలి. ఐదేళ్లలో కనీసం ఒక్క ఏడాదైనా ప్రజల కోసం సమయం కేటాయించేవారిని ఎన్నుకోవాలి.

**సమర్థవంతమైన పాలన అందించాలి:**



లక్షలు దోచుకునే నాయకులను ఈ ఎన్నికల్లో తిరస్కరించాలి. ఆధునిక టెక్నాలజీని అమలు చేస్తూ..పారదర్శకంగా పాలన సాగించి, అవినీతికి చోటులేని సుపరిపాలన సాగించాలి.

చంద్రకాంత్, డిగ్రీ, సిద్దీపురం

**నిస్వార్థపరులను ఎన్నుకోవాలి**



నిస్వార్థపరులను ఎన్నుకోవాలి. రాజకీయాలను అడ్డంపెట్టుకుని వ్యాపారాలు చేసుకునే వారిని దూరంగా ఉంచాలి. లేకపోతే అభివృద్ధి కుంటుపడుతుంది.

సుబ్బారెడ్డి, డిగ్రీ

**నిత్యం ప్రజల్లో ఉండాలి**



ఐదేళ్లకోకసారి కనిపించే నాయకులు వద్దు. గెలిచాక నిత్యం ప్రజల మధ్యే ఉండేవారిని వారినే ఎన్నుకుంటాం.

మస్తాన్ బాబా, డిప్లమా

## బీసీ వసతిగృహాల్లో మెరుగైన ఫలితాలు

- 10 హాస్టళ్లలో నూరుశాతం ఉత్తీర్ణత
- జిల్లాలో మొదటిస్థానం ఆత్మకూరు విద్యార్థినిదే..
- ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి



ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి

**ఆత్మకూరు, ఏప్రిల్ 23:** ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని ఏబీసీడబ్ల్యూవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 14 ప్రభుత్వ బీసీ వసతిగృహాల్లో 155 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 142మంది పాసై 95శాతం సాధించారని తెలిపారు. వీరిలో 52 మందికి 500లకు పైచిలుకు మార్కులు సాధించి ప్రతిభను చాటారని కొనియాడారు. ఆత్మకూరు బీసీ బాలికల వసతిగృహానికి చెందిన హాలీమసాఫియా (586) మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షనీయమన్నారు. ఏఎస్ పేట, అన్నారెడ్డిపాళెం, అనంతసాగరం, కామిరెడ్డిపాడు, కలువాయి, బ్రాహ్మణపల్లి, ఆత్మకూరు, సంగం, రేవూరు, బుచ్చిరెడ్డిపాళెం-2 వసతిగృహాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం, అత్యధిక మార్కులు వచ్చాయన్నారు. కృషి చేసిన హెచ్‌డబ్ల్యూవోలు, ఉపాధ్యాయులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## 2025 నాటికి మలేరియాను నివారించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

**నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 23 :** మలేరియా ప్రాణాంతక వ్యాధి అని, 2025 నాటికి దానిని నివారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న మలేరియా నివారణ దినోత్సవం నేపథ్యంలో ఆ వ్యాధిని కలిగించే దోమల నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో కొన్ని మలేరియా కేసులు మాత్రమే నమోదు అవుతున్నాయని చెప్పారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా సోకిన వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం మలేరియా నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత, డెమో శ్రీనివాసరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి నాగార్జున, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

**క్షయ నివారణ వ్యాక్సిన్ వేయాలి**

జిల్లాలో గుర్తించిన వారందరికి క్షయ వ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సిన్ వేయాలని డీఎం హెచ్‌వో పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బీసీజీ వాక్సిన్ ప్రాధాన్యతపై వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మే 24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- ఈ నెల 30లోగా ఫీజు చెల్లించాలి : డీఈవో

**నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 :** పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి 31వతేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్, 29న ఫిజికల్ సైన్స్, 30న బయలాజికల్ సైన్స్ 31న సోషల్ స్టడీస్ పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ నుంచి www.bseap.apgov.in ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 30వతేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.50ల అపరాధ రుసుంతో మే 23వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. అలాగే రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల30వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.500లు, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.1000లు చెల్లించాలన్నారు. ఈ ఫీజులను www.bseap.apgov.in ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. అలాగే పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా డీజీఈ కార్యాలయానికి పంపిన దరఖాస్తులను పరిశీలించమన్నారు. మరిన్ని వివరాలకు దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయం లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## టీడీపీ అధికారంలోకి వస్తేనే సామాజిక న్యాయం

- మాదిగ, ఉపకులాల ఐక్యవేదిక నేతలు

**నెల్లూరు (వీఆర్సీ) ఏప్రిల్ 23:** టీడీపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు సామాజిక న్యాయం జరుగుతుందని మాదిగ, ఉపకులాల నాయకులు అన్నారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ నేతృత్వంలో మాదిగ, ఉపకులాల నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీ జాతీయఫోరం అధ్యక్షుడు రవిరాఘవేంద్ర, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేదెండ్ల సుబ్బారావు, బేడ, బుడగజంగం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు మాట్లాడారు. మాదిగలకు, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం చేస్తామన్న చంద్రబాబునాయుడుకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలో రిజర్వుడు ఎమ్మెల్యే సీట్లు 27 ఉండగా, వైసీపీ కేవలం 10 సీట్లు మాత్రమే కేటాయిందన్నారు. టీడీపీ 15 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించిందన్నారు. 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించడానికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, నాయకులు ఆర్‌జే ప్రకాష్, కే సుబ్బారావు, కే బెంజిమన్, చిన్నయ్య, తాటిపర్తి రఘు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

**అల్లూరు, ఏప్రిల్ 23 :** పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన అల్లూరు మండలం నార్తుమోపూరు జడ్పీ హైస్కూలులో మంగళవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఓ విద్యార్థినిని ఫ్లెక్సీ వేయాలి ఫొటో తీసుకుని రమ్మని ఆ పాఠశాల పీఈటీ నిడిగుంట రాజా పాఠశాలకు పిలిచాడు. పాఠశాలకు వచ్చిన ఆ విద్యార్థినిపై ఎవరూ లేని సమయం చూసి గట్టిగా పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అతనిని వదిలించుకున్న విద్యార్థిని అక్కడి నుంచి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## యువకుడి దారుణహత్య

- కత్తితో విచక్షణారహితంగా దాడి ● ఆటోనగర్‌లో మృతదేహం



రక్తపుమడుగులో దశరథ మృతదేహం

**నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23:** ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు అతి కిరాతకంగా హత్య చేశారు. కాళ్లమడిమలు, చేతి మణికట్లను నరకడంతోపాటు విచక్షణారహితంగా గుండెల్లో పొడిచారు. తీవ్రగాయా లతో రక్తస్రావమై ఆ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు బీవీనగర్ రైల్వేగేటు సమీపంలోని వినాయకస్వామి గుడివీధిలో పీ రామయ్య, నాగమణి దంపతులు ఉంటున్నారు. వారికి దశరథ(28), మేఘనాథ్‌లు సంతానం. మేఘనాథ్ వివాహమై వేరుగా కాపురం ఉంటున్నాడు. దశరథ తల్లిదండ్రుల వద్దే ఉంటు న్నారు. పదోతర గతి పూర్తి చేసిన దశరథ కొంతకాలం బీవీనగర్‌లోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి మానేశాడు. అనంతరం కొద్ది రోజులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. అది కూడా ఆపేసి కావలి ఆర్టీసీ బస్టాండులోని ఓ షాపులో కొంత కాలం పనిచేసి ఇంటికొచ్చాడు. కొద్ది రోజులు ఇంటి వద్దే ఉంటున్న అతను ప్రస్తుతం తాతతో కలిసి పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పని ఉందని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి బయటకు వచ్చిన దశరథ రాత్రి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఈ క్రమంలో మంగళవారం ఆటోనగర్‌లోని ఖాళీస్థలాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వేదాయపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే బీవీనగర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తి అటుగా వెళుతూ మృతదేహాన్ని చూసి దశరథగా గుర్తించి అతని తల్లికి సమాచారమిచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లి కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరైంది. గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కత్తితో దాడి చేయడంతో దశరథ చనిపోయాడు. తన కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకో వాలని ఆ తల్లి పోలీసులను కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సంఘట నాస్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. అంతేకాక మృతు డికి ఉన్న పరిచయాలు, స్నేహితులు, వారి మధ్య ఉన్న విభేదాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 123 |
| లేయర్ లైవ్ | 93 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 244 |
| లేయర్ | 158 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6785 |
| వెండి కిలో ధర | రూ. 82,200 |
| వెండి ఒక గ్రాము | రూ. 84.20 |

## నాలుగు నామినేషన్ల దాఖలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 23:** ఆత్మకూరులో మంగళవారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా రాజేశ్వరి, బీఎస్పీ అభ్యర్థి తోటగిరికృష్ణ, సమాజ్‌వాజ్ అభ్యర్థి వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా వెంకటేశ్వర్లు నామినేషన్‌లను ఎన్నికల అధికారి మధులతకు అంద జేశారు.

**ఉదయగిరిలో ఏడు..**

**ఉదయగిరి:** నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

## మన భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం

- తిరుపతి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చింతా



**కలువాయి :** సార్వత్రిక ఎన్నికలు మన భవిష్యత్తుకు ఎంతో కీలకం కానున్నాయని కేంద్ర మాజీ మంత్రి, తిరుపతి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. బుధవారం కలువాయిలో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోని వచ్చిన వెంటనే నిరుపేద మహిళకు ప్రతి ఏడాది లక్ష రూపాయిలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం తీసుకువస్తామన్నారు.

## గెలిపించండి..అభివృద్ధి చేస్తాం

- ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో ఆనం

**సంగం, ఏప్రిల్ 23:** నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీచేశామని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వంగల్లు, జంగాలకండ్రిక, మర్రిపాడు గ్రామాల్లో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలకు వచ్చిన ఆయనకు స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ప్రజాగళం చైతన్య రథంపై నుంచి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పని చేసిందా అన్ని ప్రజలను అడిగారు. పదేళ్లుగా ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఉన్న ఒకే కుటుంబం ఎలాంటి అభివృద్ధి చేసిందో ఆలోచించు కోవాలన్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే దర్శనమిస్తున్నాయని చెప్పారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లోకి రాక ముందే జిల్లా వ్యాప్తంగా సొంత నిధులతో అనేక మినీ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయనకు పోటీలో ఉన్న విజయసాయిరెడ్డి రూ.13లకు సారాయి తయారు చేసి రూ.200లకు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాలరాస్తున్నాడని మండిపడ్డారు. గ్రామాల ప్రజలకు తాగునీరిచ్చే వేమిరెడ్డికి ఓటేయాలో, సారాయి తయారు చేసే విజయసాయిరెడ్డికి ఓటేయ్యాలో నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు.



సంగంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న వంగల్లు సర్పంచి రామయ్య

**వైసీపీ సర్పంచి టీడీపీలో చేరిక**

ఈ సందర్భంగా ఆనం సమక్షంలో వంగల్లు సర్పంచ్ కాళహస్తి రామయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డి సర్పంచ్ రామయ్యకు పార్టీ కండువాతో వేసి స్వాగతం పలికారు. అనంతరం రామయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ప్రచారం**

స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయం కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి. మహేష్ మాదిగ, లక్ష్మయ్య మాదిగ ఉన్నారు.

**మర్రిపాడు:** ఆత్మకూరు అభివృద్ధి జరగాలంటే టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని గెలిపించాలంటూ ఆనం కుమార్తె కైవల్యారెడ్డి ఆదివారం డీసీపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, మాజీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

**అనంతసాగరం:** తెలుగుదేశం మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత, సీనియర్ నాయకులు ముద్దులూరు సంజీవ్‌రాజులు మంగళవారం ముస్తాపురం, పాతాళపల్లి, గోవిందమ్మపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అధిక మెజారిటీతో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎంవీ సుబ్బరాజు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**వరికుంటపాడు, ఏప్రిల్ 23:** మండలంలోని గణేశ్వరాపురం పిల్లాపేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ తిరుపతయ్య మంగళవారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

**ఉదయగిరి, ఏప్రిల్ 23:** కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపి రూపురేఖలు మారుస్తానని అసెంబ్లీ అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేసిన అనంతరం బయట విలేకరులతో మాట్లాడారు. మెట్ట ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా మన్నా రు. కార్యక్రమయంలో నాయకులు బాలయ్య, రాజగోపాల్‌రెడ్డి, మాల కొండయ్య, దామోదర్‌రావు పాల్గొన్నారు.

## పొన్నమాను గ్రామోత్సవం

**సంగం, ఏప్రిల్ 23:** వంగల్లు కోదండరాముడిని సోమవారం రాత్రి పొన్నమానుపై గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కానుకలు అందచేసి మొక్కు లు తీర్చుకున్నారు.

## నడి రోడ్డుపై ఆగిన లారీ

- ఇబ్బందులు పడ్డ వాహనచోదకులు

**కావలి రూరల్, ఏప్రిల్ 23:** స్థానిక ఉదయగిరి రోడ్డు నుంచి పెద్దపవని రోడ్డుకు తిరిగే మలుపులో మంగళవారం లారీ మరమ్మతులకు గురై నడిరోడ్డుపై ఆగిపోయింది. పట్టణ ఎఫ్‌సీఐ గోదాము నుంచి పీడీఎస్ బియ్యం లోడుతో జలదంకి మండలానికి వెళ్తూ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో పెద్దపవని రోడ్డుకు వెళ్లాల్సిన బస్‌లు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



నడి రోడ్డుపై నిలిచి ఉన్న లారీ



## చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

- ఇంటింటి ప్రచారంలో కాకర్ల

**వింజమూరు:** పట్టణంలో మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్. దేవతామహల్ వరకు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రతి ఒక్కరినీ కలుస్తూ తనకు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొంగిటి రఘునాథరెడ్డి, మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావు, మాజీ కన్వీనర్ గుడా నర్సారెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఎమ్మెస్ నాయుడు పాల్గొన్నారు.

**సూపర్‌సిక్స్ పథకాలతో సంక్షేమం**

**దుత్తలూరు (ఉదయగిరి రూరల్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అంతకుముందు పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులతో కలిసి రాచవారిపల్లి, తురకపల్లి, జంగాలపల్లి, భైరవరంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నాశనమైందన్నారు. టీడీపీ ప్రచారాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో విజయం తథ్యం అన్నారు. వెనుకబడిన మెట్ట ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజాసేవకులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకుర్తి రవీంద్రబాబు, గురవయ్యనాయుడు, ఉండేలా గురవారెడ్డి, చీదర్ల మల్లికార్జున, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, కాకర్ల మధు, సింగవరపు వెంకటేశ్వరరెడ్డి, యనమల రత్నం, దయానందం, మాదాల రామచంద్ర, పాముల సుబ్బరాయుడు, అన్నపురెడ్డి వెంగళరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న కాకర్ల దంపతులు



ఉదయగిరి రూరల్ : దుత్తలూరులో మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న కంభం, టీడీపీ నాయకులు

**ఉదయగిరి రూరల్:** జీ.చెరువుపల్లికి చెందిన వైసీపీ నాయకుడు కప్పా వెంకటేశ్వర్లు మంగళవారం తన అనుచరులతో కలిసి గంగిరెడ్డిపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మన్నేటి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు, ప్రవీణ్‌రాజు, జగన్నాథం, సుబ్బయ్య, నీరుకట్టు శ్రీనివాసులు పాల్గొన్నారు.

**వరికుంటపాడు:** శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కోదండరామస్వామికి కల్యాణం నిర్వహించారు. ఉత్సవంలో నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత సుంకర సోదరులు అంజనాద్రి, వెంకటాద్రిలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో కాకర్ల దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ, బీసీలకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఎలా ఇస్తారు?


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

బిట్రగుంట, ఏప్రిల్ 23: ఎస్సీ, బీసీ, కులాలకు చెందిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చారని గిరిజన మహిళ గుర్రంకొండ సుమతి రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కప్పరాళ్లతిప్పకు చెందిన గంధం ధనమ్మ భర్త గంధం బాబురావు ఎస్సీ (మాల) కులం కాగా అధికారులు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఇవ్వ డం ఎంత వరకు సబబు అన్నారు. అదే గ్రామంలో వడ్డెర కులానికి చెందిన కొందరు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు గుత్తి సుధాకర్, దేవరకొండ వరుణ్, ఆవుల అరుణ్, బచ్చు నిరంజన్, గుర్రంకొండ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

కావలిటౌన్, ఏప్రిల్ 23: కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదలకూరి కల్యాణ్ బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్ బాబు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు బీఫాం అందజేశారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగే నామినేషన్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, శ్రేయేభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు మానస, తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

బిట్రగుంట, ఏప్రిల్ 23: బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.నిజాముద్దీన్ పదవ తరగతిలో 534 మార్కులతో పాఠశాల ఫస్ట్ రావడంతో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ ఠాగూరు రూ.1000 ప్రోత్సాహ బహుమతిగా మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లితండ్రులు అల్లాభక్షు, ఆయెషా, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, ఏప్రిల్ 23: బోగోలు యాదవపాలెంలో వెలసి ఉన్న కోదండరామాలయ ప్రాంగణంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. బోగోలు మాజీ సర్పంచు, ఉపసర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్, రమణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కళ్యాణ అలాగే బృందావనం కోదండరామాలయంలో వైభవంగా స్వామి అమ్మవార్ల కల్యాణం జరిగింది. కల్యాణోత్సవాలు తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

## టీడీపీలోకి 'మెట్టుకూరు'

కలిగిరి, ఏప్రిల్ 23: ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పార్టీ మారినా ఆయన అనుచరుడైన చిరంజీవిరెడ్డి మౌనముద్ర దాల్చి 50రోజుల తర్వాత తుది నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. ఈయన చేరికతో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీకి కలిసొస్తుందని ఆ పార్టీ వర్గాలు తెలిపారు.

## కేంద్ర బలగాలతో సీఐ కవాతు

కావలి రూరల్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 1వ పట్టణ సీఐ రాజేష్ మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు 60 మంది కేంద్ర బలగాలు, 1వ పట్టణ సిబ్బందితో కలసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో, ఆముదాలదిన్నెలో కవాతు నిర్వహించారు.

## కౌరగుంటలో ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 23: దగదర్తి మండలం కొత్తపల్లి కౌరగుంట పంచాయతీలో అంబేడ్కర్ పార్టీ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, నక్క గిరి, కప్పల నవీన్ కుమార్, కిరణ్ కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరులో రోడ్‌షో

అల్లూరు: నార్తుమోపూరు, గ్రద్దగుంట, బట్రకాగొల్లు, నార్తుఆములూరు, బీరంగుంటలో మంగళవారం ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు రోడ్‌షో నిర్వహించారు. నాయకులు ఎస్.సాయికుమార్, ఎం.సుకుమార్‌రెడ్డి, డీ.కృష్ణారెడ్డి, బీద రమేష్ పాల్గొన్నారు.

# పల్లె గొంతెండుతోంది!

- వేసవి ప్రారంభంలోనే మంచినీటి ఎద్దడి
- క్లోరినేషన్‌కు నోచని రాళ్లపాడు జలాలు
- కలుషిత నీటితో రామాయపట్నంలో చర్మవ్యాధులు
- అడుగంటిన సొన కాలువలు
- ఉలవపాడులో ఏడాదంతా నీటి కష్టాలే..


బావిలో నీటిపై పేరుకుపోయిన పాచి, వ్యర్థాలు

ఉలవపాడు, ఏప్రిల్ 23 : వేసవి కాలం ప్రారంభంలోనే మంచినీటి ఎద్దడి ఏర్పడి పల్లె ప్రజల గొంతెండుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 16 వేల జనాభా కలిగిన ఉలవపాడు మేజర్ పంచాయతీలో ఐదు రోజులకొకసారి కూడా మంచినీరు సరఫరా కాని పరిస్థితి నెలకొంది. గ్రామానికి 5 కి.మీ దూరం నుంచి పైప్‌లైన్ ద్వారా బావి నీటిని పంపింగ్ చేసి మూడు ట్యాంక్‌లను నింపాలి. పైగా కరెంటు సరఫరాను బట్టి పంపింగ్ జరుగుతోంది. దీంతో 5 రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో నీటి సొనల్లో పూర్తిగా ఊట తగ్గిపోయే పరిస్థితి ఉంది. అన్ని వనరులు ఉన్నప్పుడే ఏడాదంతా నీటి కష్టాలతో అల్లాడుతుండగా సొనల్లో నీటి ఊట లేకుంటే అప్పుడు ఎలా చేయాలిరా దేవుడా.. అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇళ్లల్లోని బోర్లు కూడా భూగర్భ జలమట్టం ఘననీయంగా పడిపోతోంది. రామాయపట్నం ప్రజలకు మంచినీరు సరఫరా జరిగే ప్రాజెక్టుకు సంబంధించిన విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవడంతో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ నీరు కలుషితమై దుర్వాసన రావడంతోపాటు ఆ నీటిని వినియోగించిన ప్రజలకు శరీరంపై దురదలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో గత్యంతరంలేక గ్రామంలోని ఆర్వో ప్లాంటు నీరు కొనుగోలు చేసి వినియోగించక తప్పడం లేదంటున్నారు. కనీసం రాళ్లపాడు నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ అయినా చేసి సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రామాయపట్నం ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉండగా వీరేపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో మంచి నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుందో వారికే తెలియడం లేదు. మన్నేరు ఒడ్డున ఉన్న మన్నేటికోటలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా గ్రామానికి, ముఖ్యంగా ఎస్సీ కాలనీకి రెండు రోజులకు ఒకసారి నీర్లు వదులుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నీటిని విడుదల చేసే పంచాయతీ ఉద్యోగి సకాలంలో నీరు వదలకపోవడంపై గ్రామస్థులు ప్రశ్నిస్తే అడ్డగోలు సమాధానం చెబుతున్నాడన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతని పనితీరులో మార్పు లేదని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు.


ఉలవపాడు సమీపంలో సొన కాలువలో అడుగంటిన నీరు

### అధికారుల విఫలం

రామాయపట్నంలో పంచాయతీకి చెందిన బోరు బావి ఉంది. దానిని ఉపయోగించుకోవడంలో పంచాయతీ అధికారులు విఫలం అయ్యారు. ప్రత్యామ్నాయంగా రాళ్లపాడు రిజర్వాయర్ నీరు డైరెక్టుగా పంపింగ్ చేస్తుండటంతో నీరు దుర్వాసన, ఆకుపచ్చ రంగులో వస్తున్నాయి. వీటిని వాడితే ఒంటిపై దురదలు, చర్మ వ్యాధులు వస్తున్నాయి.

- వై.రామారావు, రామాయపట్నం

### సొనల ఊట తగ్గడంతో బావిలో నీరు అడుగంటింది

సొనల ఊట తగ్గడంతో బావిలో నీరు అడుగంటింది. అయితే ప్రత్యామ్నాయంగా ఉన్న బోర్లు సిద్ధం చేసి నీటి ఎద్దడి లేకుండా చూస్తాం. ఎస్సీ కాలనీ వద్ద ఉన్న ట్యాంక్ నింపాలంటే ముందుగా సంపు నిండి తరువాత మోటారు ద్వారా ట్యాంక్‌లోకి పంప్ చేయాలి. అందువలన సమయం పడుతుంది. డైరెక్ట్‌గా ట్యాంక్ నింపేలా చూస్తున్నాం.

- విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఉలవపాడు

# అట్టహాసంగా 'కావ్య' ఎన్నికల ప్రచారం


ప్రచార రథంపై మాట్లాడుతున్న క్రిష్ణారెడ్డి, పక్కన మాలేపాటి


దగుమాటికి హారతులు ఇస్తున్న మహిళలు

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 23 : దగదర్తి మండలం వెలిపోడు, కాట్రాయపాడు పంచాయతీలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు రవీంద్రనాయుడుల ఆధ్వర్యంలో మంగళవారం కావలి అభ్యర్థి దగుమాటి(కావ్య) క్రిష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం అట్టహాసంగా జరిగింది. స్థానికులు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ దగుమాటికి ఘన స్వాగతం పలికారు. వెలిపోడు గ్రామంలోని శివాలయంలో పూజల అనంతరం గిరిజన కాలనీలో మృతి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను కావ్య, మాలేపాటిలు పరామర్శించారు. జెండా చెట్టు సెంటర్, మబ్బుగుంటపాలెం, కామినేనిపాలెం గ్రామాల్లో మహిళలు హారతులు పట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కాట్రాయపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే చంద్రబాబునాయుడు సీఎంగా రావాలన్నారు. జిల్లా, నియోజకవర్గాలు అన్ని విధాల అభివృద్ధి చెందలంటే ఉమ్మడి పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, విమానాశ్రయం, రామయ్యపట్నం హార్బర్ నిర్మాణాలు చంద్రబాబు ప్రతిపాదనలో పురుడు పోసుకున్నవే అన్నారు. బాబును సీఎంగా చేసుకుని వాటిని ప్రారంభించుకోవడమే కాకుండా మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని యువతకు ఉపాధి కల్పించుకుందామన్నారు. టీడీపీని గెలిపించుకుని ఆంధ్రరాష్ట్రానికి పట్టిన దరిద్రాని తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### చెన్నారెడ్డిపాలెంలో...

బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కావలి టీడీపీ అభ్యర్థి సోదరుడు దగుమాటి వేణు గోపాల్‌రెడ్డి, స్థానిక నేతలు కాండ్ర రఘురాంనాయుడు, గణేషం రమేష్‌రెడ్డి, పిన్నిబోయిన రవీంద్రలలు సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు అబ్దుల్, రజాక్, బాషా తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలోకి చెన్నూరు వైసీపీ సర్పంచు దంపతులు


చెన్నూరు వైసీపీ సర్పంచుకు కండువా వేస్తున్న కావ్య

కావలి, ఏప్రిల్ 23 : : దగదర్తి మండలం చెన్నూరు మేజర్ పంచాయతీ వైసీపీకి చెందిన సర్పంచు బుక్కే సునీత, ఆమె భర్త వెంకటరమణనాయక్‌లు మరో 60 కుటుంబాలతో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కావలి పట్టణం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి ఎన్డీఏ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచుతో పాటు మోడే హరినాయక్, మోడే వెంకటరమణయ్యనాయక్, ప్రభాకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, బుక్కే శేషానాయక్, మోడే శ్రీనివాస నాయక్, మోడే జయరాం నాయక్ తదితరులు ఉన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులపై చులకన భావంగా చూస్తుండటంతో అక్కడ ఇమడలేక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.

# జలదంకిలో వైసీపీకి మళ్లీ షాక్!

- బ్రాహ్మణక్రాకలో 120 కుటుంబాలు టీడీపీలో చేరిక


వేమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన బ్రాహ్మణక్రాక వాసులు

జలదంకి, ఏప్రిల్ 23 : జలదంకి మండలంలో అధికారి వైసీపీకి వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్యతో పాటు పలువురు ఎమ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, సొసైటీ డైరెక్టర్, మండల, గ్రామనాయకులు టీడీపీలో చేరిపోయారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి స్వగ్రామం బ్రాహ్మణక్రాకలో వైసీపీకి చెందిన 120 కుటుంబాల వారు టీడీపీ చేరారు. నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో మంగళవారం వారికి పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ వరుస పరిణామాలతో వైసీపీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

### టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి, గట్టుపల్లి, కమ్మవారిపాలెం, చామదల, అన్నవరం, తదితర గ్రామాల్లో మంగళవారం టీడీపీ నాయకులు ఇంటింటా కరపత్రాలు పంచుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్, భవిష్యత్‌కు గ్యారెంటీ, సామాజిక పింఛను రూ.4వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, బీసీ కులాలకు 50ఏళ్లకే పింఛను తదితర సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయని ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో టీడీపీ, తెలుగుయువత మండల అధ్యక్షులు పులుగుంట మధురెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, కూరపాటి మాలకొండారెడ్డి, కొల్లా క్రిష్ణ, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు బండారు తిరుపతిరెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు


జలదంకి : గట్టుపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

### మండలంలో ముమ్మర ప్రచారం

కొండాపురం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మర ప్రచారం జరిగింది. ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడి ప్రభాకర్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు.

# జనసంద్రంలా కందుకూరు

- అట్టహాసంగా టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నామినేషన్


సబ్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందచేస్తున్న ఇంటూరి, పక్కన వేమిరెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 23: కందుకూరులో జనసంద్రం ఉప్పొంగింది. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వేలాది మంది జనసందోహం మధ్య భారీ ర్యాలీతో మంగళవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. కందుకూరు పట్టణంతో పాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది పసుపు సైనికులు తరలివచారు. అశేషజనవాహిని మధ్య పామూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి పామూరు రోడ్డు జంక్షన్, ఎన్టీఆర్ విగ్రహం, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్ల మీదుగా ప్రత్యేక వాహనంలో నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నేతలు ర్యాలీగా సబ్ కలెక్టరు కార్యాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంకమ్మ ఆలయం, పెద్ద బజారులో ఉన్న కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, వినాయకుడి దేవాలయంలోను, కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో నాగేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద మసీదులో, జేడీబీఎం టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఒంగోలు విజయ డెయిరీ మాజీచైర్మన్ చల్లా శ్రీనివాసరావు, కందుకూరు మున్సిపల్ మాజీచైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు పులి మల్లికార్జునతో పాటు నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఓపెన్‌టాప్ వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. నామినేషన్ సమయానికి సబ్ కలెక్టరు కార్యాలయం వద్దకు నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేరుకోగా ఆయనతో కలిసి నాగేశ్వరరావు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయనతోపాటు ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య కూడా మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, కండ్రా మాల్యాద్రి, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు కందుకూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్న ఇంటూరి నాగేశ్వరరావు అక్కడ ఏర్పాటు చేసిన గుర్రంపై ఎక్కి అక్కడి నుంచి టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు.

**యువతకు ఉపాధే లక్ష్యం :** కందుకూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తానని, వ్యవసాయ రంగంలో సాగునీటి సమస్య పరిష్కారం, గిట్టుబాటు ధరలకోసం కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన నామినేషన్ దాఖలు చేసిన అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, జాబ్‌మేళాలు, రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పనకు కృషిచేస్తానన్నారు. రాళ్లపాడుకు సోమశిల జలాలు సక్రమంగా వచ్చేలా కృషి, రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనుల పూర్తికి, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలకు సాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఉలవపాడు ప్రాంతంలో మామిడి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఉద్యాన కళాశాలకు చినలాటిరిపి వద్ద శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కారును ఢీకొన్న బైక్

- యువకుడికి గాయాలు

కావలి రూరల్, ఏప్రిల్ 23: బైక్‌పై వేగంగా వచ్చి ముందు వెళ్తున్న కారును ఢీకొన్న ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని రాజువారి చింతలపాలెంకు చెందిన ప్రసన్న మంగళవారం పాఠశాల నుంచి తమ పిల్లలను తీసుకుని కారులో ఆర్సీపాలెం వెళుతూ పెద్దపవని రోడ్డు కూడలిలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు వేగం తగ్గించగా వెనుకనే వచ్చిన బైక్ అదుపుతప్పి ముందు ఉన్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో పట్టణంలోని మున్సిపల్ ప్లాట్లలో నివాసం ఉంటున్న వెంకటక్రిష్ణకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణం లోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

## కావలిలో 6వ రోజు 4 నామినేషన్ల దాఖలు

కావలి, ఏప్రిల్ 23: కావలి అసెంబ్లీకి ఆరవ రోజైన మంగళవారం నాలుగు నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనా నాయక్‌కు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గర్రె సురేష్‌బాబు, గాలి రవి తమ నామినేషన్లు దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఇండియా తరుపున యెల్లు సాల్మన్ మూడో సెట్టు నామినేషన్‌ను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున సబ్బెల విజయభాస్కర్ రెడ్డి రెండో సెటు నామినేషన్‌ను దాఖలు చేశారు.

## పోలేరమ్మను దర్శించుకున్న వేమిరెడ్డి కోటారెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 23 : మండలంలోని నార్తుమోపూరు దళితవాడలో వెలసిన పోలేరమ్మను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. దళితవాడలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన స్థానిక నాయకులు రేబాల శంకర్‌రెడ్డి, బండి అమర్‌రెడ్డిలతో కలసి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మావంతు ఎపుడబయా..!?

'ఈ సారి ఎన్నికలు భలే రంజుగా ఉన్నాయిలే. డబ్బున్న పెద్ద పెద్దోళ్లంతా పోటీలో ఉండారు. ప్రధాన పార్టీలతోపాటు ఇండిపెండెంటోళ్లు కూడా డబ్బునోళ్లే. ఇంకేం మాకు జాతరే కదా! ఓటర్ల కన్నా ముందుగా మమ్మల్ని ప్రసన్నం చేసుకోవాలి. ఆ పక్కూరిలో నాయకుడికి రూ.2 లక్షలు.. ఇంకో ఆయనకు మూడు లక్షలు ఇచ్చా రంట. మరి మా వంతు ఎప్పుడు అబయా!?' పట్టణాల మొదలు పల్లెల దాకా ఇదీ వరస. మొన్నటిదాకా తమను పట్టించుకోలేదనే ధోరణిలో ఉన్నవారంతా 'ఇప్పుడేం మందల' అంటున్నారు. ప్రధాన పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులంతా డబ్బున్నోళ్లతోపాటు అధికారం అడ్డంపెట్టుకుని సంపాదించిన వారే కదా ఎవరి కోసం ఇస్తారబ్బా. అలకలు పూనిన, కండువాలు మార్చుకున్నా భారీగా ప్యాకేజీలు వస్తాయని జోరుగా ప్రచారం జరుగుతుంటే మనకు ప్యాకేజీలు రావాలంటే ఏ కోణం ఎన్ను కోవాలనే మీమాంసలో ఉన్నారు. పెద్ద లీడర్ల నుంచి గల్లీ దాకా పార్టీ కండువాలు మార్చుకుంటుంటే ఎవరెవరికి ఎంతెంత వచ్చిందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. మరోవైపు ప్రధాన పార్టీల నేతలు కూడా ప్యాకేజీలు ఇస్తేనే ఎన్నికల ప్రచారంలో హుషారుగా ఉంటున్నారు. ప్యాకేజీ విషయంలో ఏమాత్రం తగ్గినా ససేమీరా అంటున్నారు. ఇప్పుడిదే హాట్‌టాపిక్‌గా మారింది.

- కావలి

## వలస వాసుల ఓట్లే కీలకం !

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో వలసవాసుల ఓట్లే కీలకంగా మారారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 300పైచిలుకు గ్రామాల్లో వేలాదిమంది ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. వీరిపైనే అన్ని పార్టీల అభ్యర్థులు దృష్టిసారించారు. వలస వాసులు రెండురకాలు. ఆర్థికంగా బలంగా ఉంటూ ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారు, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు కలిగిన వారు కొందరైతే... పొట్టకూటి కోసం వెళ్లేవారు మరికొందరు. ఇతర పట్టణాల్లో నివసించే వారి సంఖ్య వేలల్లో ఉంది. వీరందర్ని సమీకరించుకోవాల్సిన బాధ్యత చోటా నాయకులపైనే ఉంది. వలసవాసులే ఈసారి ఎన్నికల్లో ఉదయగిరి అభ్యర్థుల భవిత్యాన్ని నిర్ణయించనున్నారు.

- ఉదయగిరి

ఇదీ మందూ





## రంగుల కనికట్టు... ఓటర్లను ఆకట్టు !

- ప్రచారంలో ప్రత్యేకంగా కలర్స్
- ప్రజల్ని ఆకర్షించేందుకు వినూత్న ప్రయోగం
- రూ.లక్షలు వెచ్చిస్తున్న నేతలు
- చుక్కల్లో పూల ధరలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : జిల్లాలో ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. జాతీయ, ప్రాంతీయ పార్టీలతోపాటు ఇండిపెండెంట్‌లు కూడా బరిలో నిలిచారు. వీరంతా వినూత్నంగా ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. పార్టీల జెండాల రంగులు, రంగురంగుల టోపీలు, టీషర్ట్‌లు, మాస్క్‌లతో అభిమానులు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రజలు కూడా ఆసక్తిగా వాటిని తిలకిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ ఆయా పార్టీల రంగుల జెండాలతో నిండిపోయాయి. మరికొందరైతే ఓటర్లను మరింత ఆకట్టుకునేందుకు ప్రచార వాహనాలకు ముందు రథాలు, గుర్రాలకు పార్టీ జెండాలు కట్టి, డప్పుల వాయిద్యాలతో ప్రచారానికి వెళుతున్నారు. ప్రచారాల నిర్వహణకు అభ్యర్థులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రచార సామగ్రిని అందించే వ్యాపారులు, కార్మికులు కూడా ఎంతో ఉత్సాహంగా వాటిని విక్రయిస్తున్నారు.

**● జోరుగా ప్రచారం**

వివిధ పార్టీల జెండాలు, అజెండాలతో ప్రచారాలు చేస్తుండడంతో జిల్లాలో కోలాహలంగా నెలకొంది. ప్రచార రథాలు, పార్టీ జెండాలు, పార్టీ గుర్తులుండే టోపీలు, టీషర్ట్‌లతోపాటు ఆయా పార్టీల మేనిఫెస్టోలను కరపత్రాల్లో పొందుపరిచి ఇంటింటి అందచేస్తున్నారు. ఇందుకుగాను అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తమ పార్టీలకు చెందిన రంగులు, గుర్తులుండేలా అన్నింటిని తయారు చేయించుకుంటున్నారు. వీటిని జిల్లాలో కొద్దిమంది మాత్రమే తయారు చేస్తున్నారు. అధికంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఆర్డర్‌లు ఇచ్చి చేయించుకుంటున్నారు. ఒక్కో టీషర్టు క్వాలిటీని బట్టి రూ.100 నుంచి రూ.500ల వరకు ఉండగా, టోపీ రేటు రూ.50ల నుంచి రూ.100ల వరకు ఉంది. పార్టీ జెండాలను సైజును బట్టి రూ.50ల నుంచి రూ.500లకు అందిస్తున్నారు. వీటిని ఆయా నేతలు వారి స్థాయి, హోదాలను బట్టి కొనుగోలు చేస్తున్నారు. జెండాలు మాత్రం ఒక్కసారి సిద్ధం చేసుకున్నవే వినియోగిస్తుండగా టీషర్ట్‌లు, టోపీలను మాత్రం ఎప్పటికప్పుడు కొత్తవాటిని తయారు చేయించుకుంటున్నారు. కరపత్రాలను కూడా ఒక్కో అభ్యర్థి రోజుకు 500 నుంచి వెయ్యి వరకు ముద్రించుకుంటున్నారని, వీటిని వారికి అందించేందుకు అధిక సమయం ప్రింటింగ్ ప్రెస్‌లో సమయాన్ని వెచ్చిస్తున్నామని ప్రింటర్ల నిర్వాహకులు చెపుతున్నారు. ఎన్నికల సమయం కాబట్టి వీటికి డిమాండ్ ఉండడంతో అభ్యర్థుల అవసరాలను బట్టి తమవద్ద ఉన్న మెటీరియల్స్‌ను అందచేస్తున్నా మని వారు తెలిపారు. ఇలా జిల్లావ్యాప్తంగా పార్టీల జెండాలు, టీషర్ట్‌లు, టోపీల వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నది. వీటిమీద ఆధారపడి జీవించే వర్కర్‌లకు కూడా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోంది.

**చుక్కల్లో పూలధరలు**

ఓవైపు ఎన్నికలు... మరోవైపు శుభకార్యాలతోపాటు మండుతున్న ఎండలతో పూల ధరలు చుక్కలనంటాయి.మార్కెట్‌లో పూలకు డిమాండ్ పెరిగింది.. పూలు, పూలదండలు, బొకేల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. మార్కెట్ కు వస్తున్న పూలన్నీ కూడా నేతల ప్రచారాలకే అమ్ముడవుతున్నాయి. మిగిలిన కార్యక్రమాలకు అంతంతమాత్రంగానే పూలు దొరుకుతున్నాయి.. ఒకవేళ దొరికినా అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఆలయాల్లో పూజలకు కూడా పూలు దొరకడం లేదని మహిళలు వాపోతున్నారు. మామూలు రోజుల్లో రూ.20 నుంచి రూ.30లకు దొరికే పూలు ప్రస్తుతం రూ.100లు ధర పలుకుతున్నాయి. దీనికి తోడు వేసవి ప్రారంభం కావడం, దిగుబడి తగ్గడం లాంటి పరిణామాలతో పూలకు బాగా డిమాండ్ ఏర్పడింది.







ముదివర్తి కాజ్‌వే నిర్మాణం ఆరు తీరప్రాంత మండలాల సమస్య. ఓవైపు ఆక్వా రైతులు, మరోవైపు మత్స్యకారులు, ఇంకోవైపు సామాన్య ప్రజలు... ఇలా ఎవరు ఏ పని మీద నెల్లూరుకు రాకపోకలు సాగించాలన్నా పెన్నానది దాటాల్సిందే. శారీరకంగా, మానసికంగా ఇది ప్రజలకు భారంగా మారింది. పెన్నాపై కాజ్‌వే నిర్మిస్తే ఈ సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో తీరప్రాంతవాసులు కోరుతున్నారు.



# ఐదేళ్లుగా టెండర్లతోనే..!

మోసం గురూ!

- ముదివర్తి కాజ్‌వేకు ముహూర్తం కుదిరేనా ?
- అటకెక్కిన నిర్మాణ పనులు
- శిలాఫలకంతో జగన్ డ్రామాలు

నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాంలో దీనిపై కదలిక వచ్చింది. ప్రతిపాదనలు కూడా తయారయ్యాయి. అంతలోనే ఎన్నికలు రావడం, ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఇరిగేషన్ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలకు అనుమతులు వచ్చేందుకు దాదాపు రెండేన్నరేళ్లు పట్టింది. అనంతరం ఏడాది తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య కాజ్‌వే(బ్రిడ్జి) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడాదన్నర గడిచింది. కానీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జగన్ శంకుస్థాపన చేసే నాటికి కనీసం టెండర్లు కూడా పూర్తికాలేదు. తీర ప్రాంత ప్రజలను మోసం చేసేందుకే జగన్ కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పూర్తి కాకుండానే శంకుస్థాపన చేశారన్న ప్రచారం అనాడే జరిగింది. అనుకున్నట్లుగానే కాజ్‌వే నిర్మాణం ముందుకు సాగలేదు. ఆయన వేసిన శిలాఫలకం తీరప్రాంతవాసులను వెక్కిరిస్తున్నది. ఇదేనా జగనన్న మాటపై నిలబడడం అని ఒక వర్గం ప్రజలు నిలదీస్తుండగా.. మాట ఇవ్వడం.. మడమ తిప్పడం అన్నకు అలావాటేగా..! అని మరో వర్గం ఎద్దేవా చేస్తున్నది.

**● జాప్యం చేస్తూ వచ్చిన వైసీపీ**

ఈ క్రమంలో గతేడాది ఏప్రిల్ నుంచి టెండర్లను ప్రారంభించారు. ఇప్పటివరకు ఐదు సార్లు టెండర్లు పిలిస్తే గానీ ఫైనలైజ్ కాలేదు. మొదటి నాలుగుసార్లు టెండర్లు పిలిచినప్పుడు ఒక కాల్‌లో కాంట్రాక్టర్లు టెండర్లు వేయకపోవడం, మరో కాల్‌లో సింగిల్ టెండర్ దాఖలవడం, ఇంకోసారి సాంకేతిక అనుమతులతో టెండర్లు రద్దు చేశారు. గతేడాది చివరికి గానీ టెండర్లు పూర్తి కాలేదు. ఒక కాంట్రాక్టర్ ముందుకురాగా సీవోటీ అనుమతులు వచ్చేందుకు ఆలస్యమైంది. ఆ తదుపరి అగ్రిమెంట్ చేసుకునే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎప్పుడో కాజ్‌వే నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా జాప్యం జరిగింది. ఈ కాజ్‌వేను పూర్తి చేసి తీర ప్రాంత ప్రజల కష్టాలు తీరుస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ ఏళ్లు గడిచి మళ్లీ ఎన్నికలు కూడా వచ్చేశాయి. కాజ్‌వే మాత్రం పూర్తి కాలేదు.

**● రూ.97 కోట్లతో అంచనాలు**

ఈ కాజ్‌వే నిర్మాణానికి 2004లోనే తొలిసారి ప్రతిపాదనలు తయారయ్యాయి. కానీ ఆ తర్వాత ముందుకు కదల్లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా కాజ్‌వే నిర్మాణానికి రూ.97 కోట్ల అంచనాతో ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రెండన్నరేళ్ల క్రితం రూ.93 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. అయితే మళ్లీ కొత్త డిజైన్ అంటూ కాజ్‌వే నిర్మాణాన్ని జాప్యం చేసింది. నెల్లూరు బ్యారేజీని ఏడు లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి వరకు డిజైన్ చేసిన క్రమంలో అదే స్థాయిలో ముదివర్తి కాజ్‌వేను కూడా నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అంచనా అంచనాలు పెరిగి రూ.184.85 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తానికి మళ్లీ అనుమతులు కోరగా, మరింత ఆలస్యమైంది. ఇక చేసేది లేక అధికారులు కూడా మొదట అనుమతులు వచ్చిన రూ.97 కోట్లతోనే తొలి దశ పనులు మొదలుపెట్టాలని భావించారు.

## ప్రచారానికీ పరిమితులున్నాయి.. !



ఎన్నికల్లో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలంతా పాటించాలి. మైకుల గోలతో హోరెత్తిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. డీజే సౌండ్స్, పెద్ద పెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్దకాలుష్యం కింద కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏయే ప్రాంతంలో ఎంత శబ్దం అనుమతిస్తారనే వివరాలు ఇలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు జైలుశిక్ష పడే అవకాశముంది. ఆయా ప్రాంతాల్లో ఉండాల్సిన శబ్ద తీవ్రత. నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్దం చేయరాదు.

- ఉదయగిరి రూరల్

## తాంబూలమిచ్చి ఓట్లు అడిగేవారు.. !

నాటి ఎన్నికల ప్రచారంలో ఇన్ని ఆర్భాటాలు ఉండేవి కావు. ఎమ్మెల్యే అభ్యర్థి హంగూఆర్భాటం లేకుండా గ్రామానికి వచ్చేవారు. కొంత మంది పెద్దలతో కలసి ఓటర్లకు తాంబూలం ఇచ్చి ఓటు అడిగేవారు. అందరికీ అందుబాటులో ఉండి, ప్రజలకు సేవ చేసే వారికే ప్రజలు అప్పట్లో ఓటు వేసేవారు. మా గ్రామంలో రెండు వర్గాలు ఉండేవి. ఒక్కో వర్గానికి ఒక్కో పెద్ద ఉండే వారు. ఆ పార్టీ పెద్ద చెప్పినట్లు ఆ వర్గం ఓటర్లంతా వినేవారు. పొరుగూర్లకు వెళ్లి ఓటేయాలంటే కొందరు ఎడ్ల బండిపై, మరికొందరు నడిచి వెళ్లేవారు.



- పొత్తూరు పెంచలసుబ్బయ్య, చేజర్ల

- ఇక్కడ ఓటర్లది విలక్షణ శైలి
- వెంకయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది ఉదయగిరే..
- మైనార్టీవర్గం వ్యక్తిని గెలిపించిన ప్రాంతం

## సెగ్మెంట్ మెట్ట.. రాజకీయాల్లో దిట్ట

ముఖ చిత్రం



ఉదయగిరి దుర్గం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 23 : జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతంగా ఉదయగిరి గుర్తింపు పొందింది. కరువు ఛాయలు ఎక్కువగా కనపడేది ఇక్కడే. అయితే ఓటర్లలో రాజకీయ చైతన్యం మాత్రం ఎక్కువే. ప్రతి ఎన్నికల్లోనూ సమస్యాత్మక నియోజకవర్గం కూడా ఇదే. ఫ్యాషన్ రాజకీయాలకు అలవాలం. 1952లో ఉదయగిరి నియోజకవర్గం ఏర్పడింది. 1955లో కొంత ప్రాంతాన్ని విభజించి నందిపాడు నియో జకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి, నాగినేనిగుంట, వెలిగండ్ల ఉదయగిరిలోనూ, నందిపాడు, చినఅన్నలూరు, కనియంపాడుల తో నందిపాడు నియోజకవర్గం ఏర్పడింది. 1962 వరకూ ఇవి కొనసాగాయి. ఆ తరువాత నియోజక వర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయ గిరి, కావలిలో విలీనమైంది.

**● విలక్షణమైన ఓటర్లు**

నియోజకవర్గ ఓటర్లు తొలి నుంచి విలక్షణశైలి చూపుతున్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటి మద్రాసు రాష్ట్ర ఆర్థికమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డిని ఓడించారు. రాజకీయ అనుభవంలేని కోవి రామయ్యను ఆ ఎన్నికల్లో గెలిపించారు. 1955 ఎన్నికల్లో షేక్ మౌలానాసాహెబ్‌ను ఎన్నుకొన్నారు. జిల్లాలో ఆయనే తొలి మైనారిటీ ఎమ్మెల్యే. తరువాత ఏ నియోజకవర్గం లోనూ ఎన్నిక కాలేదు. 1978, 1983 ఎన్నికల్లో జనతా పార్టీ, బీజేపీల తరుపున పోటీ చేసిన వెంకయ్యనాయుడుకి పట్టం కట్టారు. ఆయన ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉదయగిరి రాజకీయ వేదికైంది. 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా కోవి రామయ్యచౌదరి, 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ మౌలానసాహెబ్, 1962లో కాం గ్రెస్ అభ్యర్థిగా పులి వెంకటరెడ్డి, 1967లో స్వతంత్ర పార్టీ అభ్య ర్థిగా ధనెంకుల నరసింహం, 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నెబోయిన చెంచురామయ్య, 1978, 1983లో జనతా, బీజేపీల తరుపున ఎం.వెంకయ్యనాయుడు, 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాదాల జానకిరాం, 1994లో ఇండిపెండెంట్‌గా, 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి గెలుపొందారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012(ఉపఎన్నిక), 2019లో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామారావులు గెలుపొందారు.



ఉదయగిరి నియోజకవర్గ మ్యాపు

**● తొలి ఎమ్మెల్యే ఖర్చు రూ.15 వేలు**

ఉదయగిరి నుంచి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థి కోవి రామయ్య ఎన్నికల ఖర్చు రూ.15 వేలు మాత్రమే. అప్పట్లో ఆయన తనకున్న 12.50 ఎకరాల మాగాణిని ఎకరం రూ.1000ల చొప్పున అమ్ముకొని ఎన్నికల్లో పోటీ చేసి బెజవాడ గోపాల్‌రెడ్డిపై విజయం సాధించారు.

**● మంత్రిగా ఒక్కరే..**

ఉదయగిరిలో కాంగ్రెస్ పార్టీ తరుఫున 1989లో తొలిసారిగా పోటీ చేసి గెలుపొందిన మాదాల జానకిరాం ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మంత్రివర్గంలో ఘనులు, భూగర్భజల శాఖా మంత్రిగా పనిచేశారు. ఉదయగిరి నుంచి ఇప్పటివరకు మంత్రి పదవి పొందింది జానకిరాం ఒక్కరు మాత్రమే.

**● నందిపాడు ఎమ్మెల్యేగా వింజమూరు వాసి**

1955లో నందిపాడు నుంచి వింజమూరుకు చెందిన కాశిం వెంకటరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. 1955 నుంచి 1962 వరకు ఏడేళ్లపాటు ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. 1962లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో విలీనమైంది.

**ఇప్పటి వరకు విజయం సాధించిన అభ్యర్థులు**

| సంవత్సరం | గెలిచిన వారు | పార్టీ పేరు |
|---|---|---|
| 1952 | కోవి రామయ్య | ప్రజాపార్టీ |
| 1955 | షేక్ మౌలానాసాహెబ్ | కాంగ్రెస్ |
| 1962 | పులి వెంకటరెడ్డి | కాంగ్రెస్ |
| 1967 | దనెంకుల నరసింహం | ఇండిపెండెంట్ |
| 1972 | పీ.చెంచురామయ్య | కాంగ్రెస్ |
| 1978 | ఎం.వెంకయ్యనాయుడు | జనతా |
| 1983 | ఎం.వెంకయ్యనాయుడు | బీజేపీ |
| 1985 | మేకపాటి రాజమోహన్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 1989 | మాదాల జానకిరాం | కాంగ్రెస్ |
| 1994 | కంభం విజయరామిరెడ్డి | ఇండిపెండెంట్ |
| 1999 | కంభం విజయరామిరెడ్డి | టీడీపీ |
| 2004 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2009 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2012 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | వైసీపీ |
| 2014 | బొల్లినేని వెంకటరామారావు | టీడీపీ |
| 2019 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | వైసీపీ |

## ఉపాధి కల్పించేవారికే ఓటు

యువగళం



చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పార్టీకే నా ఓటు వేస్తా. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. రాష్ట్రంలోనే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నేతలు కృషి చేయాలి.కొత్తగా ఓటు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా.

- అడపా శ్రీజిత్ జాలయ్యనాయుడు, బీటెక్ మొదటి సంవత్సరం, లింగసముద్రం



విక్రమార్కుడు...

**నాలుగోసారి పోటీ చేస్తున్నా..**

కలిగిరి మండలం వీరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాపతి మధుసూదనరావు 2012 ఉపఎన్నికలతోపాటు 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా నాలుగోసారి బరిలో నిలుస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

- కలిగిరి

## ఓయబ్బో... ఎంతప్రేమో ?

ఎట్టెట్టా





పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్ది ప్రజలపై నాయకులకు అభిమానం, ఆత్మీయతలు పెల్లుబికుతున్నాయి. వారు అభ్యర్థుల తరఫున గ్రామాల్లో ఇంటింటా ప్రచారం సాగిస్తూ సామాన్యులపై చూపిస్తున్న ఆప్యాయత, అనురాగాలను చూసి పలువురు అవాక్కవుతున్నారు. అన్నా.. అక్కా... బావా, బాబాయ్... తాత, అవ్వా.. అంటూ సంబంధాలను కలుపుతూ నేతలు ఓటర్లను పిలవడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. మామీద మీకు ఇంత ప్రేమ ఉందా?.. అని ప్రజలు విస్తుపోతున్నారు. వారి నాటకాలకు అనుగుణంగా సామాన్యులు కూడా ఏమాత్రం తగ్గకుండా అదే ఆప్యాయతను కనబరుస్తున్నారు. అన్నా.. మేం కూడా మీవాళ్లమే.. మాఇంట్లో ఓటన్నీ మీకు... అంటూ చెప్పిపంపుతున్నారు. కాగా ఇప్పటికే నాయకులు కులాలు, వృత్తులు, సంఘాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆయా వర్గాల సమస్యలపై కూడా హామీలు గుప్పించారు. ఎన్నికలా.. మజాకా!

- అనంతసాగరం

# కోవూరు సర్వేపల్లి

# పేకమేడల్లా కూలుతున్న కాకాణి కంచుకోటలు

**● సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి**

**వెంకటాచలం, ఏప్రిల్ 23:** సర్వేపల్లి నియోజకవర్గంలోని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కంచుకోటలు పేకమేడల్లా కూలిపోతున్నాయని, ఎన్నికల నాటికి వైసీపీ పూర్తిగా తుడిచిపెట్టుకొని పోవడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మండలంలోని సర్వేపల్లి, చవట పాళెం పంచాయతీ ఎర్రగుంట, వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామాల నుండి 42 కుటుంబాలు, సర్వేపల్లి మాజీ ఉపసర్పంచ్ కుంకాల సుమన్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ మందల పవన్‌కుమార్ వైసీపీని వీడి సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, కుంచి శ్రీనివాసులు యాదవ్, నాయకులు చెన్నకృష్ణయ్య, తెనాలి రమణయ్య, గోపీ, సురేంద్ర, కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి, వంశీ యాదవ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

● మండలంలోని కసుమూరులో సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సింధురెడ్డి ప్రచారం నిర్వహించారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

### అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి : శ్రుతిరెడ్డి

**పొదలకూరు:** వైసీపీ ప్రభుత్వాన్ని, మంత్రి కాకాణిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని మాజీ మంత్రి సోమిరెడ్డి కోడలు శృతిరెడ్డి పిలుపునిచ్చారు. పొదలకూరులోని శ్రీనివాసపురం, యాదవవీధిలో టీడీపీ నాయకులు, కార్యకర్త లతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగుణమ్మ, మల్లి కార్జున్‌నాయుడు, నువ్వుల కవిత, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కాకాణికి ఓటు అడిగే హక్కు లేదు

**ముత్తుకూరు:** సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రధానంగా ముత్తుకూరు మండలంలో ప్రజలను ఓటు అడిగే హక్కు మంత్రి కాకాణికి లేదని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోలంరాజుగుంట, అట్రంవారికండ్రిగ, దువ్వూరువారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు బాబిరెడ్డి, సురేంద్ర, మల్లికార్జున యాదవ్, ఈపూరు మునిరెడ్డి, కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.

### సర్వేపల్లిలో సోమిరెడ్డి విజయం తథ్యం

**మనుబోలు :** ఈ ఎన్నికల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం తథ్యం అని టీడీపీ మండ లాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి అన్నారు జట్లకొండూరు నుంచి వెందోటి భాస్కర్‌రెడ్డితో పాటు 30 కుటుంబాలు, కట్టువపల్లి నుంచి 9 కుటుంబాలు, బద్దెవోలు నుంచి శానంపూడి సురేంద్రరెడ్డితో పాటు 6 కుటుంబాలు, వెంకన్నపాళెం నుంచి అడపాల శివకుమార్‌రెడ్డి, అక్కంపేట నుంచి దొడ్ల శ్రీనువాసులు రెడ్డి ఆధ్వర్యంలో 6 కుటుంబాలు మంగళవారం సోమిరెడ్డి సమక్షంలో వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

### సోమిరెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

**తోటపల్లి గూడూరు:** ముత్యాలతోపు పట్టపుపాలెంలో మంగళవారం టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరబోయిన గంగాధర్, రాధాకృష్ణారెడ్డి, బైనబోయిన శ్రీనివాసులు, చెరుకూరు పరంధామయ్య, ఊటుకూరు అవినాష్, దొరబాబు, రామాంజనేయులు, బైనబోయిన సుధాకర్ పాల్గొన్నారు.

## టీడీపీలోకి 'మెట్టుకూరు'

**కలిగిరి, ఏప్రిల్ 23:** ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పార్టీ మారినా ఆయన అనుచరుడైన చిరంజీవిరెడ్డి మౌనముద్ర దాల్చి 50రోజుల తర్వాత తుదినిర్ణయం తీసుకున్నారు. మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. ఈయన చేరికతో ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీకి కలిసొస్తుందనే ఆశాభావం ఆ పార్టీ వర్గాలు తెలిపారు.

● **సైదాపురం :** తిప్పిరెడ్డిపల్లిలో రాపూరు మాజీ ఏఎంసీ చైర్మన్ నోటి రమణారెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి వైసీపీకి చెందిన తిప్పిరెడ్డిపల్లి సర్పంచ్ పాకాల శ్రీనివాసులుయాదవ్‌తో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, పోలయ్య, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, వెంకటేశ్వర్లు రెడ్డి, కీర్తిపాటి రాజశేఖర్‌రాజు, కేపీరాజు, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

### సర్వేపల్లికి 3 నామినేషన్లు దాఖలు

**వెంకటాచలం :** సర్వేపల్లి నియోజకవర్గానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థిగా ప్రసాద్ జానకి, బిరదవోలు మస్తానయ్య, కూరపాటి విజయబాబు నామినేషన్ పత్రాలను ఎన్నికల ఆర్వో చిన్న ఓబులేసుకు అందజేశారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**పొదలకూరు, ఏప్రిల్ 23:** పట్టణంలోని రామ మందిరం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. కోనం బ్రహ్మయ్య, హైమావతి, ఊకోటి వెంకటేశ్వర్లు, పద్మావతి, ఊకోటి లక్ష్మీనారాయణ, కళాభారతి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భక్తుల రామనామ స్మరణతో రామమందిరం వీధి మారుమోగింది.

### వైభవంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ



రాములవారి ఆలయంలో హోమం చేస్తున్న పండితులు

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23:** మండలంలోని పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం పండితులు, పురోహితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

### అభయాంజనేయస్వామి..



ఆంజనేయస్వామి ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

**మనుబోలు, ఏప్రిల్ 23:** మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామంలో మంగళవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దళితవాడ సమీపంలో భారీ అభయాంజనేయ విగ్రహాన్ని ఏర్పాటుచేసి అడుగుభాగాన స్వామి శిలావిగ్రహాన్ని గ్రామ ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటసుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠకు ముందు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురి డీబార్

**వెంకటాచలం, ఏప్రిల్ 23 :** విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలలో 688 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 497 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కాగా, ఉదయం కావలిలోని జవహర్‌భారతీ డిగ్రీ కళాశాలలో ఒకరు, నెల్లూరులోని సర్వోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మధ్యాహ్నం కావలిలోని జవహర్‌భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం ఏడుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

### విశాలాక్షి అమ్మవారికి కుంకుమ పూజలు

**పొదలకూరు, ఏప్రిల్ 23:** పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో శ్రీ శివశక్తి క్షేత్రంలో విశ్వేశ్వర సమేత విశాలాక్షి అమ్మవారికి లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధం

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23:** మండలంలోని పెనుబల్లి ప్రధాన సెంటర్‌లో రోడ్డుపక్కనే వున్న స్థానిక అర్చకుడు, రైతు నాగేశ్వరరావు నివాసంలోని ప్రాగణంలో వున్న 1ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వ గడ్డివామి పై పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారులు సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### కాంగ్రెస్ నేతల ఎన్నికల ప్రచారం

**ముత్తుకూరు, ఏప్రిల్ 23 :** కాంగ్రెస్ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్లే పారిశ్రామిక ప్రగతి సాధ్యమైందని తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. మంగళవారం ముత్తుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పథకాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూల చంద్రశేఖర్, దుంపల నాగరాజు, అంకయ్య, తేజోవతి, తదితరులు పాల్గొన్నారు.



### సోమిరెడ్డి నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

**వెంకటాచలం, ఏప్రిల్ 23 :** వెంకటాచలంలో బుధవారం ఉదయం 10 గంటలకు సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారని ఆపార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సోమిరెడ్డి అభిమానులు, యువత వేలాదిగా తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# టీడీపీతోనే యువతకు భవిత

**● ప్రచారంలో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

**ఇందుకూరుపేట, ఏప్రిల్ 23:** యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవిపేటలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ యువతకు 20లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.1500 నిరుద్యోగ భృతి కల్పిస్తామని, బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ రూ.4వేలు అందిస్తామని, స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15వేలు అందిస్తామని, ప్రతి ఇంటికీ సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, గ్రామాల్లో సైడు కాలువల నిర్మాణం చేపడతామని, తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, ఏడుకొండలు, గంపల అనీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి



విడవలూరు : చౌకచర్లలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఇందుకూరుపేట: : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నీలిమారెడ్డి



కొడవలూరు : ఎన్నికల ప్రచారంలో ఏకోల్లు వంశీధర్ రెడ్డి

● కొత్తూరు రావూరు డొంక ఎస్టీ కాలనీలో ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సైడ్ కాలువలు నిర్మాణం చేపడుతామని తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన ఇల్లు అర్థాంతరంగా నిలిచిపోయిన వాటిని అధికారంలోకి రాగానే పూర్తి చేయిస్తామని తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్లు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన తాగునీరు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అర్హులైన వారందరికీ వృద్ధాప్య పింఛను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, మునగాల రంగారావు, నెల్లూరు రవీందర్‌రెడ్డి, కుమార్, రామచంద్రయ్య, బీజేపీ నాయకులు లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● **విడవలూరు :** మండలంలోని చౌకచర్ల గ్రామంలో టీడీపీ నాయకులు సమాధి శ్రీనివాసులు, ఓగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రశాంతిరెడ్డితోపాటు నేతలు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కృష్ణచైతన్య, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ప్రతి కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి కరపత్రాలను అందజేశారు. చెముకుల శ్రీనివాసులు, ఈదూరు సురేష్, చిన్న రాగయ్య, హరి, తదితరులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** పట్టణంలోని 8, 9వార్డుల్లో టీడీపీ నాయకులు వింజం రామానాయుడు, మహేష్ ప్రచారం చేశారు. శేషయ్య, హరనాథ్, సుబ్బారావు, సతీష్, వెంకటేశ్వర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● **కొడవలూరు :** యల్లయపాళెం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఏకోల్లు వంశీధర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. రియాజ్ బాషా, రాఘవేంద్ర, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రెడ్డిగుంట గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు గరికపాటి రాజేంద్రకుమార్ ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

## 2025 నాటికి మలేరియాను నివారించాలి

**• డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య**



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

**నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 23 :** మలేరియా ప్రాణాంతక వ్యాధి అని, 2025 నాటికి దానిని నివారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న మలేరియా నివారణ దినోత్సవం నేపథ్యంలో ఆ వ్యాధిని కలిగించే దోమల నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో కొన్ని మలేరియా కేసులు మాత్రమే నమోదు అవుతున్నాయని చెప్పారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా సోకిన వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం మలేరియా నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత, డెమో శ్రీనివాసరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి నాగార్జున, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్షయ నివారణ వ్యాక్సిన్ వేయాలి

జిల్లాలో గుర్తించిన వారందరికి క్షయ వ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సిన్ వేయాలని డీఎం హెచ్‌వో పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బీసీజీ వాక్సిన్ ప్రాధాన్యతపై వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మే 24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

**● ఈనెల 30లోగా ఫీజు చెల్లించాలి : డీఈవో**

**నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 :** పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి 31వతేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్, 29న ఫిజికల్ సైన్స్, 30న బయలాజికల్ సైన్స్, 31న సోషల్ స్టడీస్ పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ నుంచి www.bseap.apgov.in ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 30వతేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.50ల అపరాధ రుసుంతో మే 23వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. అలాగే రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల30వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.500లు, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.1000లు చెల్లించాలన్నారు. ఈ ఫీజులను www.bseap.apgov.in ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. అలాగే పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా డీజీఈ కార్యాలయానికి పంపిన దరఖాస్తులను పరిశీలించమన్నారు. మరిన్ని వివరాలకు దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయం లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## టీడీపీ అధికారంలోకి వస్తేనే సామాజిక న్యాయం

**● మాదిగ, ఉపకులాల ఐక్యవేదిక నేతలు**

**నెల్లూరు (వీఆర్సీ) ఏప్రిల్ 23:** టీడీపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు సామాజిక న్యాయం జరుగుతుందని మాదిగ, ఉపకులాల నాయకులు అన్నారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ నేతృత్వంలో మాదిగ, ఉపకులాల నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీ జాతీయపోరం అధ్యక్షుడు రవిరాఘవేంద్ర, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేదెండ్ల సుబ్బారావు, బేడ, బుడగజంగం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు మాట్లాడారు. మాదిగలకు, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం చేస్తామన్న చంద్రబాబునాయుడుకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలో రిజర్వుడు ఎమ్మెల్యే సీట్లు 27 ఉండగా, వైసీపీ కేవలం 10 సీట్లు మాత్రమే కేటాయిందన్నారు. టీడీపీ 15 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించిందన్నారు. 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించడానికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, నాయకులు ఆర్‌జే ప్రకాష్, కే సుబ్బారావు, కే బెంజిమన్, చిన్నయ్య, తాటిపర్తి రఘు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన

**● తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు**

**అల్లూరు, ఏప్రిల్ 23 :** పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన అల్లూరు మండలం నార్తుమోపూరు జడ్పీ హైస్కూలులో మంగళవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఓ విద్యార్థినిని ఫ్లెక్సీ వేయాలి ఫొటో తీసుకుని రమ్మని ఆ పాఠశాల పీఈటీ నిడిగుంట రాజా పాఠశాలకు పిలిచాడు. పాఠశాలకు వచ్చిన ఆ విద్యార్థినిపై ఎవరూ లేని సమయం చూసి గట్టిగా పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అతనిని వదిలించుకున్న విద్యార్థిని అక్కడి నుంచి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## యువకుడి దారుణహత్య

**● కత్తితో విచక్షణారహితంగా దాడి ● ఆటోనగర్‌లో మృతదేహం**



రక్తపుమడుగులో దశరథ మృతదేహం

**నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23:** ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు అతి కిరాతకంగా హత్య చేశారు. కాళ్లమడిమలు, చేతి మణికట్లను నరకడంతోపాటు విచక్షణా రహితంగా గుండెల్లో పొడిచారు. తీవ్రగాయా లతో రక్తస్రావమై ఆ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు బీవీనగర్ రైల్వేగేటు సమీపంలోని వినాయకస్వామి గుడివీధిలో పీ రామయ్య, నాగమణి దంపతులు ఉంటున్నారు. వారికి దశరథ(28), మేఘనాథ్‌లు సంతానం. మేఘనాథ్ వివాహమై వేరుగా కాపురం ఉంటున్నాడు. దశరథ తల్లిదండ్రుల వద్దే ఉంటు న్నారు. పదోతర గతి పూర్తి చేసిన దశరథ కొంతకాలం బీవీనగర్‌లోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి మానేశాడు. అనంతరం కొద్ది రోజులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. అది కూడా ఆపేసి కావలి ఆర్టీసీ బస్టాండులోని ఓ షాపులో కొంత కాలం పనిచేసి ఇంటికొచ్చాడు. కొద్ది రోజులు ఇంటి వద్దే ఉంటున్న అతను ప్రస్తుతం తాతతో కలిసి పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పని ఉందని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి బయటకు వచ్చిన దశరథ రాత్రి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఈ క్రమంలో మంగళవారం ఆటోనగర్‌లోని ఖాళీస్థలాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వేదాయపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే బీవీనగర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తి అటుగా వెళుతూ మృతదేహాన్ని చూసి దశరథగా గుర్తించి అతని తల్లికి సమాచారమిచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లి కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరైంది. గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కత్తితో దాడి చేయడంతో దశరథ చనిపోయాడు. తన కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకో వాలని ఆ తల్లి పోలీసులను కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సంఘట నాస్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. అంతేకాక మృతు డికి ఉన్న పరిచయాలు, స్నేహితులు, వారి మధ్య ఉన్న విభేదాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 123 |
| లేయర్ లైవ్ | 93 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 244 |
| లేయర్ | 158 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6785 |
| వెండి కిలో ధర | రూ. 82,200 |
| వెండి ఒక గ్రాము | రూ. 84.20 |

# నెల్లూరు సిటీ
# నెల్లూరు రూరల్

## సిటీకి ఐదు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఎం అభ్యర్థి మూలం రమేష్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 23 : నెల్లూరు సిటీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఎం నుంచి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ నామినేషన్ పత్రాలను ఆర్వో వికాస్ మర్మత్‌కు అందచేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఉన్నారు. కాగా, భారత్ చైతన్య యువజన పార్టీ నుంచి కాళహస్తి చెంచు మహేష్ నామినేషను దాఖలు చేశారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థులుగా అవధానం సత్యసాయి, వేలూరు రంగారావు, దాసరి గౌతమ్ నామినేషన్ పత్రాలు అందచేశారు.

### రూరల్‌కి నాలుగు..

నెల్లూరు (వెంకటేశ్వరపురం): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా నలుగురు నామినేషన్లు వేశారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో మాలోలకు నామినేషన్ పత్రాలను అందించారు. వైసీపీ నుంచి ఆదాల ప్రభాకర్ రెడ్డి తరపున పాశం శ్రీనివాసులు నామినేషన్ దాఖలు చేశారు. బహుజన సమాజ్ పార్టీ తరుపున బీ శ్రీరాములు రెండు సెట్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ ఫయాజ్, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సర్దార్ హుస్సేన్ నామినేషన్లు వేశారు.

## టీడీపీకి ప్రజల్లో విశేషాదరణ

● కేతంరెడ్డి వినోద్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో విశేషాదరణ లభిస్తోందని ఆ పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. నగరంలోని 51వ డివిజన్‌లో కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణను గెలిపించాలని కోరుతూ ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ చేసిన ఘోర తప్పిదాలు, వైసీపీలో వర్గవిభేదాలు, ముస్లిం మైనార్టీలకు గత ఐదేళ్లుగా చేసిన అన్యాయాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారిని వాడుకోవాలనుకోవడం మైనార్టీలందరూ గుర్తిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఎంపీగా వీపీఆర్‌ను, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణలను గెలిపించాలని కోరారు.

### టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా..

నెల్లూరు(హరనాథపురం) : టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్‌గా అద్దంకి సుమతి నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులిచ్చారు.

### గరుడసేవలో కోదండరాముడు

నెల్లూరు (సాంస్కృతికం) : శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో కోదండరామస్వామికి మంగళవారం రాత్రి గరుడ వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మోహినీ అలంకరణ, రాత్రి పల్లకీసేవ జరిగాయి. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహలత వ్యవహరించారు. గురుకృపా కళాక్షేత్రం విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

● మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం తిరుమంజనం, విశేష పూజలు, మోహినీ అవతారం, స్వామివారికి గిన్నెభిక్ష వేడుకలు జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ అనంతరం గరుడోత్సవం జరిగింది.

## జీజీహెచ్ వైద్యులు సమయపాలన పాటించాలి

● రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్



వైద్యాధికారుల సమావేశంలో డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 23 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ ఆదేశించారు. మంగళవారం జీజీహెచ్‌లో వైద్యాధికారులతో సమీక్ష జరిపారు. వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యుల హాజరు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉందన్నారు. అలాగే ఓపీతోపాటు సర్జరీ, స్పెషాలిటీ వైద్య సేవలను రోగులకు అనుగుణంగా పెంచాలని సూచించారు. ఇన్‌పేషెంట్లకు సంబంధించిన కేస్‌షీట్లలో రోగులకు అందించిన వైద్య చికిత్సల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వివరాలు సక్రమంగా నమోదు చేయకపోయినా, డ్యూటీ నుంచి మధ్యలో వెళ్లిపోయినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ కళారాణి, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఐదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు మాట్లాడుతూ చిరుప్రాయం నుంచి పిల్లలందరూ కలసి మెలిసి తోబుట్టువుల్లా ఆడుకుంటూ చదువుకున్నారన్నారు. విద్యా సంవత్సరం పూర్తవడంతో 5వ తరగతి విద్యార్థులు ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలకు వెళుతున్నారన్నారు. అక్కడా చదువులో రాణించాలని ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రాశి, సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ మజ్జిగ చలివేంద్రాల ప్రారంభం

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 23 : ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నగరంలో మజ్జిగ చలివేంద్రాలు మంగళవారం ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియచేశారు. ముత్తుకూరు గేట్ ఫ్లైఓవర్ కింద, కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న బస్టాండ్‌లో, రెడ్‌క్రాస్ జనరిక్ మందుల షాపు వద్ద మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా చలివేంద్రాలు అవసరమైతే ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సిద్ధంగా ఉందని, స్థానికులు 9647108108 నెంబర్‌ను సంప్రదించాలని రెడ్‌క్రాస్ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, బలరామయ్యనాయుడు తెలియచేశారు.

## మాగుంట విజయ్‌రెడ్డికి ప్రముఖుల నివాళి



మాగుంట విజయ్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 23 : మాజీ ఎంపీలు మాగుంట సుబ్బరామిరెడ్డి, పార్వతమ్మల తనయుడు మాగుంట విజయ్‌రెడ్డి మృతదేహాన్ని మంగళవారం పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. విజయరెడ్డి మృతికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితోపాటు విజయ్ కుటుంబ సభ్యులందరినీ పరామర్శించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి నివాళులు అర్పించారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీ చెంచల బాబు యాదవ్, తెలుగు యువత నాయకుడు డీ శివప్రసాద్ తదితరులు విజయ్‌రెడ్డికి నివాళులర్పించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు సిటీ, కోవూరు అభ్యర్థులు పొంగూరు నారాయణ, ప్రశాంతిరెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పీవీ ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు విజయ్‌రెడ్డికి నివాళులర్పించారు.

### ఆదాలా.. దిగజారుడు రాజకీయాలు మానుకో..!

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 23 : వైసీపీ నాయకుల మధ్య ఏర్పడిన అంతర్గత కుమ్ములాటను తమ పార్టీపై రుద్దాలని చూస్తున్న ఆ పార్టీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. మంగళవారం బుజబుజ నెల్లూరులో మీడియా సమావేశం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, టీడీపీ నేత జెన్ని రమణయ్య మాట్లాడుతూ నీళ్ల విషయంలో ఏర్పడిన వివాదంలో నాగమ్మకాలనీ వద్ద వైసీపీ కార్యకర్తలు కుమ్ములాడుకున్నారని తెలిపారు. ఇరువర్గాలు ఆ పార్టీకి చెందిన వారేనంటూ తగిన సాక్షాలను సైతం విడుదల చేశారు. ఈ ఉదంతాన్ని తమ పార్టీకి రుద్దాలని చూస్తే సహించమని హెచ్చరించారు. తమ పార్టీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై నిజాయితీగా గెలిచే ధైర్యం లేని ఆదాల ఇలా దొడ్డిదారులను వెత్తుకోవడం నీచరాజకీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి కృష్ణ, పిగిలం నరేష్, నగళ్ల రాము, కరిముల్లా, షబ్బీర్, మాబాషా, అశోక్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● వైభవంగా చండీ హోమాలు

పౌర్ణమి సందర్భంగా శ్రీపీఠం ఆధ్వర్యంలో పప్పులవీధి పాండురంగనాథ స్వామి ఆలయంలో చండీహోమం జరిగింది. శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మూలాపేట శంకరమఠం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ చండీహోమాలు జరిగాయి.

● ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం నెల్లూరు గణేష్ సేవా మిత్రమండలి బహుమతులు అందజేసింది. గాలి శ్రీధర్, సుమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## జై హనుమాన్!



నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 : నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో భక్తులు చేసిన జైశ్రీరామ్, జైరామ భక్త హనుమాన్‌కీ జైజై అనే నామస్మరణలు మారుమోగాయి. కులాలకు మతాలకు అతీతంగా భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. వారికి మంచినీరు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్, ప్రసాదాలు, పుచ్చకాయలు వంటివి వివిధ వ్యాపార సంస్థలు, సంఘాలు పంపిణీ చేశాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

### కమనీయం సీతారామ కల్యాణం

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో బాలాజీనగర్ సీతారామ మందిరంలో మంగళవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉభయకర్తలుగా ఎన్ వెంకట సుబ్రహ్మణ్యం, కే గోపాల్ వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. బారకాసు సెంటర్‌లోని శ్రీరామమందిరంలోనూ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉభయకర్తలుగా మురళీకృష్ణా హోటల్స్ ఎండీ గ్రోసు సుబ్బారావు, సత్యలక్ష్మి, గ్రోసు మురళీకృష్ణ, సరిత వ్యవహరించారు.

### లక్ష్మీనరసింహుడికి గిరిప్రదక్షిణ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 23 : పౌర్ణమి తిథి సందర్భంగా మంగళవారం వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారికి గరుడ వాహనంపై గిరిప్రదక్షిణ జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోశ్చరణల నడుమ స్వామి వారు ఊరేగుతూ గిరిప్రదక్షిణ చేశారు.

## టెన్త్‌లో 'కేకేఆర్ గౌతమ్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : నగరంలోని మాగుంటలేఅవుట్‌లో గల కేకేఆర్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు సీ వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన పల్లిక 591, రాంకీ 589, పూర్విక 588, జయలాస్య 586 మార్కులు సాధించారన్నారు. వీరితోపాటు 44 మంది విద్యార్థులు 550కుపైగా మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### రూరల్ సెబ్ స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 23 : నెల్లూరు రూరల్ సెబ్ స్టేషన్‌ను జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పీ దయాసాగర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించి అనంతరం ఎన్నికల విధులపై ఆరా తీశారు. మద్యం అమ్మకాలు, అక్రమ రవాణపై నిఘా ఉంచి ఎన్నికల నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాగమయి, ఎస్సై యాకూబ్‌షరీఫ్ పాల్గొన్నారు.

### బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23: బైక్ అదుపు తప్పడంతో తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం గ్రామానికి చెందిన బీ లక్ష్మీనారాయణ, జ్యోతి కొంత కాలం కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరుకు కాపురం వచ్చారు. వారికి కిశోర్(19) అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో నివసిస్తున్నారు. కిశోర్ స్థానికంగా ఓ సెలూన్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం తెలిసిన వారి బైక్‌పై వెళుతుండగా ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ మీద వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో కిశోర్ తలకు తీవ్రగాయమైంది. అతనిని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల సమాచారంతో నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్మ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి ప్రయోజనాలెన్నో!

● రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 23 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్రానికి జరిగే ప్రయోజనాలెన్నో ఉన్నాయని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు సుపరిపాలన అందించడంతో పాటు అధికార ధరలను నియంత్రిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 9 సార్లు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడమే కాక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగుల సంఖ్య తగ్గించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని ప్రకటించారు. అనంతరం పలువురు కోటంరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. 41వ డివిజన్‌కు చెందిన రమాదేవి, రామచంద్రయ్య, నాగరాజు, రాముల మిత్ర బృందాన్ని, 12వ డివిజన్‌కు చెందిన విజయ్ కుమార్, శ్రీనివాసులు, అన్నెం పవన్ మిత్రబృందం, 30వ డివిజన్‌కు చెందిన సిద్ధవరపు పెంచలయ్య మిత్రబృందం, సౌత్‌మోపూరుకు చెందిన వైసీపీ నాయకులు రాపూరు రవి, అచ్చి శ్రీనివాసులు, వలిపి శీనయ్య మిత్రబృందాలను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కుడుముల నాగేశ్వరరావుగౌడ్ (కేఎన్‌ఆర్) పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార రోడ్‌షోలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు

## వైసీపీ పాలనలో యువత భవిత అంధకారం

● టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : వైసీపీ ప్రభుత్వంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మరోసారి అలాంటి ప్రభుత్వం వస్తే యువత భవిష్యత్ అంధకారంగా మారుతుందని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఏమీ లేకపోవడంతో ప్రజలు, యువత తీవ్ర మనస్థాపంతో ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుంటే యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్నారు. ఎన్నికల బరిలో ఉన్న తాము గెలవకముందే రాష్ట్రానికి, జిల్లాకు ఎన్నో సేవలందించామన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామని చెప్పారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, నెక్లెస్‌రోడ్డు, నిరుపేదలకు టిడ్కో గృహాలు, ముస్లింల కోసం బారాషహీద్ దర్గా అభివృద్ధి, షాదీమంజిల్, మహిళల కోసం కళాశాలలు ఇలా ఎన్నో చేపట్టామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదల స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని నారాయణ తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 3వ డివిజన్‌లో పొంగూరు రమాదేవి, 44వ డివిజన్‌లో పొంగూరు సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### యువత ఉన్నతికి పాటుపడతాం...

యువత ఉన్నతికి, వారి ఉజ్వల భవితకు తాము బాటలు వేసి వారి ఉన్నతికి పాటుపడతామని పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పెద్ద ఎత్తున యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. నారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు నాయుడు విజన్ నచ్చి పెద్ద ఎత్తున యువత పార్టీలో చేరడం అభినందనీయన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో ఎన్నో సంస్థలు, పెద్ద కంపెనీలు రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించగా, వైసీపీ ప్రభుత్వంలో అన్నీ ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయని విమర్శించారు. దీనికి పరిష్కారం జగన్‌ను ఇంటికి సాగనంపడమేనని, ప్రజలు కూడా సంసిద్ధంగా ఉన్నారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు.



### రివిట్‌మెంట్ వాల్ పూర్తిచేసే బాధ్యత నాదే...

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్నా నదికి రివిట్‌మెంట్ వాల్‌ను పూర్తి చేస్తానని డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 54వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. స్థానిక వైసీపీ నేతలు మౌలానా అబ్దుల్ అజీజ్, మౌలానా అతీఫ్, షేక్ ఖలీల్, షేక్ చాన్‌బాషా మిత్రబృందం నారాయణ సమక్షంలో టీడీపీలో చేరింది. ఈ ప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతోపాటు డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతానని నారాయణ తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలన్నీ కూడా అందరికీ వర్తింప చేసి ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చి తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు పాల్గొన్నారు.


ఆరణి నామినేషన్ సందర్భంగా తిరుపతి వీధుల్లో నిర్వహించిన ప్రదర్శన

# అట్టహాసంగా ఆరణి నామినేషన్

**● ఐదవ రోజు 31మంది నామినేషన్లు ● పార్లమెంటుకు 5... అసెంబ్లీ స్థానాలకు 26**

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఐదవ రోజైన మంగళవారం మొత్తం 31 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి ఐదుగురు, గూడూరు అసెంబ్లీకి ఐదుగురు, సూళ్ళూరుపేటకు ఇద్దరు, సత్యవేడుకు ఇద్దరు, శ్రీకాళహస్తికి ముగ్గురు, తిరుపతికి ఎనిమిదిమంది, చంద్రగిరికి ఆరుగురు చొప్పున ఆరు అసెంబ్లీ స్థానాలకు గానూ 26 మంది చొప్పున వున్నారు. వెంకటగిరి స్థానానికి మంగళవారం నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదు.తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతల అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. కాబట్టే నామినేషన్ కార్యక్రమానికి వేలాదిమంది తరలివచ్చారన్నారు. చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నామినేషన్ పత్రాలు సమర్పించారు. గూడూరు నుంచీ వైసీపీ తరపున మేరిగ మురళీధర్ రెండు సెట్లు నామినేషన్లు వేశారు. సూళ్ళూరుపేట నుంచీ కాంగ్రెస్ తరపున కన్నంబాకం హరికృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. సత్యవేడు నుంచీ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్, శ్రీకాళహస్తి నుంచీ కాంగ్రెస్ తరపున పోతుగుంట రాజేష్ నాయుడులు నామినేషన్లు వేశారు.తిరుపతి పార్లమెంటుకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.విజయ్‌కుమార్, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ తరపున బి.భరణి, ఇండియన్ బిలీవర్స్ పార్టీ నుంచీ సి.డేవిడ్, జై హిందూస్థాన్ పార్టీ తరపున అక్కిలిగుంట మధు, ఇండిపెండెంట్‌గా కట్టమంచి ప్రభాకర్ నామినేషన్లు వేశారు. గూడూరు అసెంబ్లీకి ఇండియన్ బిలీవర్స్ పార్టీ నుంచీ కర్ల రమేష్ బాబు, బీఎస్పీ అభ్యర్థి అన్నెం మల్లికార్జున, జై భారత్ నేషనల్ పార్టీ తరపున గొర్రిపాటి వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్‌గా తాటిపర్తి బాబు నామినేషన్లు దాఖలు చేశారు. సూళ్ళూరుపేట అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా నెలవల జగదీష్, సత్యవేడు అసెంబ్లీకి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచీ జి.విజయ్‌కుమార్ నామినేషన్లు వేశారు.శ్రీకాళహస్తి అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా మన్నసముద్రం నాగరాజు, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా బి.శ్రీ పవిత్ర నామినేషన్లు దాఖలు చేశారు. చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి నవ భారత నిర్మాణ సేవా పార్టీ తరపున పత్తిపుత్తూరు విశ్వనాథ రెడ్డి, జై హిందూస్థాన్ పార్టీ తరపున ఎం.నీలకంఠ, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ తరపున ఎల్.ప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ తరపున అక్కిపల్లి కృష్ణవేణి యాదవ్, ఇండిపెండెంట్లుగా శ్రీచరణ్, మాదాసి ప్రభాకర్, సంజయ్ కుమార్ నామినేషన్లు వేశారు. తిరుపతి అసెంబ్లీకి జనసేన డమ్మీ అభ్యర్థిగా ఎ.సత్యవతి, ఇండిపెండెంట్లుగా షేక్ మహ్మద్ గౌస్, ఆర్.జ్యోతి, బుడ్డోళ్ళ విశ్వనాద్, రంగూన్ శంకర్, ఊటుకూరు సుబ్రమణ్యం నామినేషన్లు దాఖలు చేశారు.


నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఆరణి శ్రీనివాసులుతో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

## వడదెబ్బతో మహిళ మృతి


కృష్ణమ్మ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: వడదెబ్బకు గురై పుత్తూరు మండలంలో ఓ మహిళ మృతి చెందింది. పరమేశ్వరమంగళం దళితవాడకు చెందిన ఎం.కృష్ణమ్మకు వడదెబ్బ తగలడంతో మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడే ఆమె మృతి చెందింది.

## రూ. 9.64 కోట్ల బంగారం,వెండి సీజ్


వాహనంలో ఆభరణాల పెట్టెలను తనిఖీ చేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

చిల్లకూరు, ఏప్రిల్ 23 : సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా మంగళవారం పెద్దఎత్తున తరలిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను ఆదాయపన్నుశాఖకు అప్పగించినట్లు సీఐ వేణుగోపాల రెడ్డి చెప్పారు. చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద వున్న చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా జీఆర్‌టీ, జోయలూకాస్, రాధాకృష్ణా, సదం జ్యూవెలరీ దుకాణాలకు చెందిన బంగారం, వెండి ఆభరణాలను నెల్లూరు నుంచి మదనపల్లె, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు సరైన ధృవీకరణపత్రాలు లేకుండా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ వాహనంలో రూ. 9,41,76,050 విలువచేసే 13 కేజీల బంగారం, రూ. 22,28,304 విలువ చేసే 21 కేజీల వెండి అభరణాలు లభించాయన్నారు. సీజ్ చేసి ఆదాయపన్నుశాఖకు అప్పగించడం జరిగిందన్నారు.

## రైల్వేస్టేషన్లలో ఎకానమీ మీల్స్

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 23: వేసవి కాలంలో రైళ్లలో సాధారణ కోచ్‌లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఎకానమీ మీల్స్ అందిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. 12 రైల్వేస్టేషన్లలో 18 కౌంటర్ల ద్వారా ఈ భోజనాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాదు, విజయవాడ, రేణిగుంట, తిరుపతి, పాకాల, గుంతకల్, వికారాబాదు, రాజమండ్రి, డోన్, నంద్యాల, పూర్ణ, ఔరంగాబాదు స్టేషన్లలో ఈ ఆహారాన్ని ప్రయాణికులకు అందిస్తున్నామని అధికారులు వివరించారు. వీటిల్లో రెండు రకాల మీల్స్ ఉన్నాయి. మొదటి రకం రూ.20, రెండో రకం స్నాక్స్‌తోపాటు భోజనం రూ.50 చొప్పున ధరలు నిర్ణయించారు. ఇప్పటికే భారత రైల్వేలో 100 స్టేషన్లలో 150 కేంద్రాల్లో ఎకానమీ మీల్స్ విక్రయిస్తున్నామన్నారు. గత ఏడాది 51 స్టేషన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేశామని తెలియజేశారు. భారత రైల్వే, ఐఆర్‌సీటీసీలు సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు.

# పక్కదారి పట్టిన రూ.20 కోట్లు?


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు


ఆడిట్ జరుగుతున్న గది

**● రుయా ఆడిట్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు**
**● కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల హస్తం**
**● కీలకమైన రికార్డులూ మాయం?**

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23 : తిరుపతి రుయాస్పత్రిలో జరుగుతున్న ఆడిట్ తనిఖీల్లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నట్టు సమాచారం.గత ఐదేళ్లలో కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల ప్రమేయముందన్న ప్రచారం జరుగుతోంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో రాజకీయ ప్రమేయంతో నామినేట్ అయిన ఓ వ్యక్తి ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఐదేళ్లుగా రుయాస్పత్రిలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, కొనుగోళ్లు, బిల్లుల మంజూరు, ఇతర నిధులు కేటాయింపు, వాటి ఖర్చులకు సంబంధించి ఇరవై రోజులుగా ఆడిట్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఆడిట్ కావడంతో 2018-19 సంవత్సరం నుంచి 2023-24 సంవత్సరం వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలను ఆడిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. సంబంధిత సిబ్బందిని కూడా విచారిస్తున్నట్టు సమాచారం.ఈ ఆడిట్‌లో ఎన్నో అక్రమాలతో పాటు దాదాపు రూ. 20 కోట్లకు పైగా నిధులు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో ఆడిట్ పూర్తికావస్తుండడంతో ఆడిట్ అధికారులు ప్రభుత్వానికి ఏ విధమైన నివేదికలు అందించనున్నారో అని అక్రమాలకు పాల్పడిన వారు ఆందోళన చెందుతున్నారు.ఒక్క ఆరోగ్యశ్రీలోనే రూ. కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. వీటితోపాటు అభివృద్ధి కమిటీ ఒత్తిడి మేరకు అధికారులు పలు ఏజన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై రూ. కోట్ల నిధులు పక్కదోవ పట్టించారని విచారణలో గుర్తించినట్లు తెలిసింది. రుయాస్పత్రి నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ. 24 కోట్ల నిధులు అవసరమవుతాయి. వీటిలో రూ. 5కోట్లకు పైగా పక్కదోవ పట్టినట్లు సమాచారం. వీటితోపాటు గడిచిన ఐదేళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ, హెచ్‌డీఎస్‌కు సంబంధించి మరో రూ. 5 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలిసింది. వీటికి సంబంధించి ఇప్పటికే పలు కీలకమైన రికార్డులను ఆడిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు ఏడాదికి సుమారు రూ. 5 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ ఖాతాలో జమవుతుంది. ఇందులో ఆరోగ్యశ్రీ వైద్య సేవల కింద అభివృద్ధి కమిటీ చెప్పిన వారికే వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పేరుతో దాదాపు ఏడాదికి రూ. 2 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. పది కోట్ల వరకు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించారు. 2020-21వ సంవత్సరంలో ఓ అధికారి ఆరోగ్యశ్రీ నిధులు పక్కదోవ పట్టించి సస్పెండయ్యాడు. అప్పటి అధికారులు నిధులు పక్కదోవ పట్టించిన ఉద్యోగిని సస్పెండు చేశారు తప్ప నిధులు రికవరీ చేయలేదు. దీంతో ఆ ఏడాదికి సంబంధించిన రికార్డులను ప్రస్తుతం ఆడిట్ అధికారులు అడగ్గా రుయా అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.చివరకు ఆ రికార్డులు లేవని చెప్పి జారుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ఆసరా పేరుతో రోగులు కాని వారి పేరుతో దాదాపు రూ.3కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైన విషయం కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.ఈ విషయం ఏడాది కిందట వెలుగులోకి రావడంతో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేసే డీఈవోలను ఇందుకు సూత్రధారులుగా చూపి సంబంధిత అధికారులను తప్పించారు.తరువాత ఈ విషయాన్ని గోప్యంగా వుంచేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ విషయంపై కూడా ఆడిట్ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

### ఆడిట్‌లో వెలుగుచూసిన విషయాలు

● పారిశుధ్య, సెక్యూరిటీ ఏజన్సీ నిర్వాహకులు తక్కువ మంది సిబ్బందిని నియమించి రికార్డుల్లో ఎక్కువ మందిని చూపుతున్నట్లు కూడా గుర్తించారు. వీరిలో ప్రధానంగా పారిశుధ్య ఏజన్సీ నిర్వాహకులు 205 మంది కార్మికులకు గాను 130 మందినే నియమించుకోవడంతో పాటు వారికి కూడా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని గుర్తించారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి చెల్లించకపోగా పారిశుధ్యానికి సంబంధించి ఎలాంటి సామాగ్రి కొనుగోలు చేయకనే నెలకు రూ.70 లక్షలకు పైగా బిల్లులు అందుకుంటున్నట్లు గుర్తించారు.

● సప్తవర్ణాల పేరుతో ఏజన్సీ నిర్వాహకులు ఆస్పత్రిలోని రోగుల పడకలపై రోజూ దుప్పట్లను మార్చాలి. కానీ వారానికి ఒకటి రెండు రోజులు మాత్రమే పడకలపై దుప్పట్లు మారుస్తున్నట్లు గుర్తించారు.

● సూపరింటెండెంట్ స్థాయి అధికారి వాడే వాహనానికి నెలకు రూ. 9 వేల లోపు మాత్రమే డీజిల్‌కు ఖర్చు చేయాలి.అయితే గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ నెలకు రూ. 15 వేలకు పైగా డీజిల్‌కు ఖర్చు చేసిన విషయాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి అప్పటి అధికారి నుంచి వివరణ తీసుకుని నిధుల రికవరీకి రంగం సిద్ధం చేస్తున్నారు.

● ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.3 కోట్ల విలువైన మందులు సరఫరా అవుతున్నా అదనంగా మందుల, వైద్య పరికరాల పేరుతో రూ. కోటికి పైగా నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి రికార్డులు కూడా మాయమైనట్లు సమాచారం.

● హెచ్‌డీఎస్ కింద ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి దాదాపు రూ. కోటి వరకు నిధులు మంజూరవుతాయి. వీటితోపాటు దుకాణాల నుంచీ అద్దెల రూపంలో మరో రూ. 30 లక్షల వరకు వస్తాయి. వీటిలో రూ. కోటికి పైగా నిధులను ఎలాంటి బిల్లులు లేకుండానే స్వాహా చేసినట్లు సమాచారం.

● ఆస్పత్రుల్లో కేవలం రెండు అంబులెన్సులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి వీఐపీల కోసం ఉపయోగిస్తుండగా మరొకటి రోగుల కోసం ఉపయోగిస్తున్నారు. కానీ డీజిల్ ఖర్చుల కింద ఏడాదికి రూ. 5 లక్షల నిధులను పక్కదోవ పట్టించిన విషయంపై కూడా ఆడిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే వాహనాల రిపేర్లు, అధికారుల ఫోన్ల ఖర్చు, స్టేషనరీ పేరుతో రూ. పది లక్షలు స్వాహా చేసినట్లు కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.

● ఆస్పత్రిలో తలుపులు, కిటికీలు, మంచాలు, వీల్‌ఛైర్లు, ఫ్యాన్లు, ఏసీలు వంటివి రిపేరు చేసేందుకు ఏడాదికి రూ. 15 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు దస్త్రాల్లో చూపుతున్నా వాస్తవంగా వీటి నిర్వహణకు రూ. 5 లక్షలు కూడా ఖర్చు కాదని ఆడిట్ అధికారులు గుర్తించారు.వీటితో పాటు కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విభాగంలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు రూ. లక్షల నిధులను పక్కదోవ పట్టించడంలో ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించినట్లు కూడా అధికారులు గుర్తించారు.

## పంత్రాంగంలో జోరుగా కోడిపందేలు

**● రోజూ చేతులు మారుతున్న రూ.లక్షలు**


డైమండ్ డబ్బా

వాకాడు, ఏప్రిల్ 23:వాకాడు మండలంలోని మారుమూల గ్రామమైన పంత్రాంగం కేంద్రంగా కోడిపందేలు, డైమండ్ డబ్బా జోరుగా సాగుతున్నాయి. తడ, నాయుడుపేట,సూళ్లూరుపేట, ఆరంబాకం, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి పందెంరాయుళ్ల వందల సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు.అనుమానం రాకుండా వారంలో మూడు రోజులు ఒక చోట, నాలుగు రోజులు మరో ప్రాంతంలో పందేలు నిర్వహిస్తున్నారు.పందేల కోసం రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం.చిన్నతోట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కనుసన్నల్లో పందేలు జరుగుతున్నట్టు సమాచారం.నిర్వాహకులతో కొంతమంది పోలీసులు కుమ్మక్కు కావడంతో స్థానికులు ఎవరైనా కోడి పందేలు జరుగుతున్నాయన్న సమాచారం పోలీసులకు ఇస్తే ఆ విషయం వెంటనే నిర్వాహకుడికి తెలిసిపోతోందన్న ఆరోపణలున్నాయి.పందెంరాయుళ్ల అక్కడినుంచి వెళ్లిపోయాకే పోలీసులు తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు. కోడిపందేల స్థావరాల పక్కనే డైమండ్ డబ్బా కూడా ఏర్పాటు చేస్తుండడంతో పందెంరాయుళ్ల జేబులు ఖాళీ అవుతున్నాయి.




## ముగ్గురు హోంగార్డులపై చర్యలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 23 : నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు హోంగార్డులపై ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చర్యలు చేపట్టారు. అధికార పార్టీ నాయకులకు సహకరిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ముగ్గురినీ నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు.

# టాయిలెట్లనూ వదలని కక్కుర్తి

**● రెండు వైపులా దుకాణాల ఏర్పాటు**
**● రోజూ రూ.3వేలు ప్రజాప్రతినిధి జేబులోకి**



ఎడమవైపున చిల్లర దుకాణం

తిరుపతి(కొర్లగుంట), ఏప్రిల్ 23: తిరుపతిలో కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధుల తీరు చూసి నగర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజల అవసరార్థం ఆర్టీసీ బస్టాండుకు ఉత్తరాన యూజ్ అండ్ పే టాయిలెట్ నిర్మించేందుకు విజయవాడకు చెందిన రవీంద్రనాథ్ స్వచ్ఛంద సేవా సంఘం ముందుకొచ్చింది. నగరపాలక సంస్థ నిబంధనల ప్రకారం దాదాపు రూ.20లక్షలతో అధునాతన సౌకర్యాలతో కూడిన మరుగుదొడ్ల కేంద్రం నిర్మించింది. అయితే ఈ నిర్మాణం తుది దశలో ఉన్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. నిర్మాణం పూర్తయి, సజావుగా ప్రారంభం కావాలంటే మరుగుదొడ్ల కేంద్రానికి ఇరువైపులా పది అడుగులు విస్తరించి, ప్లాట్‌ఫామ్స్ రెడీ చేసివ్వాలని హుకుం జారీ చేశారు. చేసేదేమీలేక నిర్మాణదారులు సొంత ఖర్చుతో ప్లాట్‌ఫామ్స్ సిద్ధం చేశాకే ప్రారంభం సజావుగా సాగింది. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆ ప్రజాప్రతినిధి తన అనుచరులతో అనధికారంగా తోపుడుబండిపై దుకాణాలు పెట్టించారు. ఓవైపు కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, బీడీ, సిగరెట్, స్నాక్స్, పాన్‌పరాక్స్ వంటి 24గంటల చిల్లర వ్యాపార దుకాణం ఓ వ్యాపారికి, మరోవైపు టిఫిన్ సెంటర్‌ను ఉదయం, సాయంత్రం వేర్వేరుగా ఇద్దరు వ్యాపారులకు అప్పగించారు.ఒక్కో వ్యాపారి నుంచి రోజుకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.3వేలను వసూలు చేసుకుంటున్నట్లు తెలిసింది.



కుడివైపున టిఫిన్ సెంటర్



## మావంతు ఎప్పుడబయా..!?


'ఈసారి ఎన్నికలు భలే రంజుగా ఉన్నాయిలే. డబ్బున్న పెద్ద పెద్దోళ్లంతా పోటీలో ఉండారు. ప్రధాన పార్టీలతోపాటు ఇండిపెండెంటోళ్లు కూడా డబ్బునోళ్లే. ఇంకేం మాకు జాతరే కదా! ఓటర్ల కన్నా ముందుగా మమ్మల్ని ప్రసన్నం చేసుకోవాలి. ఆ పక్కూరిలో నాయకుడికి రూ.2 లక్షలు.. ఇంకో ఆయనకు మూడు లక్షలు ఇచ్చా రంట. మరి మా వంతు ఎప్పుడు అబయా!?' పట్టణాల మొదలు పల్లెల దాకా ఇదీ వరస. మొన్నటిదాకా తమను పట్టించుకోలేదనే ధోరణిలో ఉన్నవారంతా 'ఇప్పుడేం మందల' అంటున్నారు. ప్రధాన పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులంతా డబ్బున్నోళ్లతోపాటు అధికారం అడ్డంపెట్టుకుని సంపాదించిన వారే కదా ఎవరి కోసం ఇస్తారబ్బా. అలకలు పూనిన, కండువాలు మార్చుకున్నా భారీగా ప్యాకేజీలు వస్తాయని జోరుగా ప్రచారం జరుగుతుంటే మనకు ప్యాకేజీలు రావాలంటే ఏ కోణం ఎన్ను కోవాలనే మీమాంసలో ఉన్నారు. పెద్ద లీడర్ల నుంచి గల్లీ దాకా పార్టీ కండువాలు మార్చుకుంటుంటే ఎవరెవరికి ఎంతెంత వచ్చిందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. మరోవైపు ప్రధాన పార్టీల నేతలు కూడా ప్యాకేజీలు ఇస్తేనే ఎన్నికల ప్రచారంలో హుషారుగా ఉంటున్నారు. ప్యాకేజీ విషయంలో ఏమాత్రం తగ్గినా ససేమీరా అంటున్నారు. ఇప్పుడిదే హాట్‌టాపిక్‌గా మారింది.

\- కావలి

## వలస వాసుల ఓట్లే కీలకం !

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో వలసవాసుల ఓట్లే కీలకంగా మారారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 300పైచిలుకు గ్రామాల్లో వేలాదిమంది ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. వీరిపైనే అన్ని పార్టీల అభ్యర్థులు దృష్టిసారించారు. వలస వాసులు రెండురకాలు. ఆర్థికంగా బలంగా ఉంటూ ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారు, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు కలిగిన వారు కొందరైతే... పొట్టకూటి కోసం వెళ్లేవారు మరికొందరు. ఇతర పట్టణాల్లో నివసించే వారి సంఖ్య వేలల్లో ఉంది. వీరందర్ని సమీకరించుకోవాల్సిన బాధ్యత చోటా నాయకులపైనే ఉంది. వలసవాసులే ఈసారి ఎన్నికల్లో ఉదయగిరి అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు.

\- ఉదయగిరి



ఇదీ మందు!



## రంగుల కనికట్టు... ఓటర్లను ఆకట్టు !

- ప్రచారంలో ప్రత్యేకంగా కలర్స్
- ప్రజల్ని ఆకర్షించేందుకు వినూత్న ప్రయోగం
- రూ.లక్షలు వెచ్చిస్తున్న నేతలు
- చుక్కల్లో పూల ధరలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 23 : జిల్లాలో ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. జాతీయ, ప్రాంతీయ పార్టీలతోపాటు ఇండిపెండెంట్‌లు కూడా బరిలో నిలిచారు. వీరంతా వినూత్నంగా ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. పార్టీల జెండాల రంగులు, రంగురంగుల టోపీలు, టీషర్ట్‌లు, మాస్క్‌లతో అభిమానులు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రజలు కూడా ఆసక్తిగా వాటిని తిలకిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ ఆయా పార్టీల రంగుల జెండాలతో నిండిపోయాయి. మరికొంద రైతే ఓటర్లను మరింత ఆకట్టుకునేందుకు ప్రచార వాహనాలకు ముందు రథాలు, గుర్రాలకు పార్టీ జెండాలు కట్టి, డప్పుల వాయిద్యాలతో ప్రచారానికి వెళుతున్నారు. ప్రచారాల నిర్వహణకు అభ్యర్థులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రచార సామగ్రిని అందించే వ్యాపారులు, కార్మికులు కూడా ఎంతో ఉత్సాహంగా వాటిని విక్రయిస్తున్నారు.

### జోరుగా ప్రచారం

వివిధ పార్టీల జెండాలు, అజెండాలతో ప్రచారాలు చేస్తుండడంతో జిల్లాలో కోలాహలంగా నెలకొంది. ప్రచార రథాలు, పార్టీ జెండాలు, పార్టీ గుర్తులుండే టోపీలు, టీషర్ట్‌లతోపాటు ఆయా పార్టీల మేనిఫెస్టోలను కరపత్రాల్లో పొందుపరిచి ఇంటింటి అందచేస్తున్నారు. ఇందుకుగాను అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తమ పార్టీలకు చెందిన రంగులు, గుర్తులుండేలా అన్నింటిని తయారు చేయించుకుంటున్నారు. వీటిని జిల్లాలో కొద్దిమంది మాత్రమే తయారు చేస్తున్నారు. అధికంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఆర్డర్‌లు ఇచ్చి చేయించుకుంటున్నారు. ఒక్కో టీషర్టు క్వాలిటీని బట్టి రూ.100 నుంచి రూ.500ల వరకు ఉండగా, టోపీ రేటు రూ.50ల నుంచి రూ.100ల వరకు ఉంది. పార్టీ జెండాలను సైజును బట్టి రూ.50ల నుంచి రూ.500లకు అందిస్తున్నారు. వీటిని ఆయా నేతలు వారి స్థాయి, హోదాలను బట్టి కొనుగోలు చేస్తున్నారు. జెండాలు మాత్రం ఒక్కసారి సిద్ధం చేసుకున్నవే వినియోగిస్తుండగా టీషర్ట్‌లు, టోపీలను మాత్రం ఎప్పటికప్పుడు కొత్తవాటిని తయారు చేయించుకుంటున్నారు. కరపత్రాలను కూడా ఒక్కో అభ్యర్థి రోజుకు 500 నుంచి వెయ్యి వరకు ముద్రించుకుంటున్నారని, వీటిని వారికి అందించేందుకు అధిక సమయం ప్రింటింగ్ ప్రెస్‌లో సమయాన్ని వెచ్చిస్తున్నామని ప్రింటర్ల నిర్వాహకులు చెపుతున్నారు. ఎన్నికల సమయం కాబట్టి వీటికి డిమాండ్ ఉండడంతో అభ్యర్థుల అవసరాలను బట్టి తమవద్ద ఉన్న మెటీరియల్స్‌ను అందచేస్తున్నా మని వారు తెలిపారు. ఇలా జిల్లావ్యాప్తంగా పార్టీల జెండాలు, టీషర్ట్‌లు, టోపీల వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నది. వీటిమీద ఆధారపడి జీవించే వర్కర్‌లకు కూడా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోంది.

### చుక్కల్లో పూలధరలు

ఓవైపు ఎన్నికలు... మరోవైపు శుభకార్యాలతోపాటు మండుతున్న ఎండలతో పూల ధరలు చుక్కలనంటాయి.మార్కెట్‌లో పూలకు డిమాండ్ పెరిగింది.. పూలు, పూలదండలు, బొకేల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. మార్కెట్ కు వస్తున్న పూలన్నీ కూడా నేతల ప్రచారాలకే అమ్ముడవుతున్నాయి. మిగిలిన కార్యక్రమాలకు అంతంతమాత్రంగానే పూలు దొరుకుతున్నాయి.. ఒకవేళ దొరికినా అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఆలయాల్లో పూజలకు కూడా పూలు దొరకడం లేదని మహిళలు వాపోతున్నారు. మామూలు రోజుల్లో రూ.20 నుంచి రూ.30లకు దొరికే పూలు ప్రస్తుతం రూ.100లు ధర పలుకుతున్నాయి. దీనికి తోడు వేసవి ప్రారంభం కావడం, దిగుబడి తగ్గడం లాంటి పరిణామాలతో పూలకు బాగా డిమాండ్ ఏర్పడింది.



## ఐదేళ్లుగా మోసం గురూ! టెండర్లతోనే..!

- ముదివర్తి కాజ్‌వేకు ముహూర్తం కుదిరేనా ?
- అటకెక్కిన నిర్మాణ పనులు
- శిలాఫలకంతో జగన్ డ్రామాలు

**ముదివర్తి కాజ్‌వే నిర్మాణం ఆరు తీరప్రాంత మండలాల సమస్య. ఓవైపు ఆక్వా రైతులు, మరోవైపు మత్స్యకారులు, ఇంకోవైపు సామాన్య ప్రజలు... ఇలా ఎవరు ఏ పని మీద నెల్లూరుకు రాకపోకలు సాగించాలన్నా పెన్నానది దాటాల్సిందే. శారీరకంగా, మానసికంగా ఇది ప్రజలకు భారంగా మారింది. పెన్నాపై కాజ్‌వే నిర్మిస్తే ఈ సమస్య తీరుతుందని ఎప్పటి నుంచో తీరప్రాంతవాసులు కోరుతున్నారు.**



నెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాంలో దీనిపై కదలిక వచ్చింది. ప్రతిపాదనలు కూడా తయారయ్యాయి. అంతలోనే ఎన్నికలు రావడం, ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఇరిగేషన్ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలకు అనుమతులు వచ్చేందుకు దాదాపు రెండేన్నరేళ్లు పట్టింది. అనంతరం ఏడాది తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య కాజ్‌వే(బ్రిడ్జి) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడాదన్నర గడిచింది. కానీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జగన్ శంకుస్థాపన చేసే నాటికి కనీసం టెండర్లు కూడా పూర్తికాలేదు. తీర ప్రాంత ప్రజలను మోసం చేసేందుకే జగన్ కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పూర్తి కాకుండానే శంకుస్థాపన చేశారన్న ప్రచారం అనాడే జరిగింది. అనుకున్నట్లుగానే కాజ్‌వే నిర్మాణం ముందుకు సాగలేదు. ఆయన వేసిన శిలాఫలకం తీరప్రాంతవాసులను వెక్కిరిస్తున్నది. ఇదేనా జగనన్న మాటపై నిలబడడం అని ఒక వర్గం ప్రజలు నిలదీస్తుండగా.. మాట ఇవ్వడం.. మడమ తిప్పడం అన్నకు అలావాటేగా..! అని మరో వర్గం ఎద్దేవా చేస్తున్నది.

### జాప్యం చేస్తూ వచ్చిన వైసీపీ

ఈ క్రమంలో గతేడాది ఏప్రిల్ నుంచి టెండర్లను ప్రారంభించారు. ఇప్పటివరకు ఐదు సార్లు టెండర్లు పిలిస్తే గానీ ఫైనలైజ్ కాలేదు. మొదటి నాలుగుసార్లు టెండర్లు పిలిచినప్పుడు ఒక కాల్‌లో కాంట్రాక్టర్లు టెండర్లు వేయకపోవడం, మరో కాల్‌లో సింగిల్ టెండర్ దాఖలవడం, ఇంకోసారి సాంకేతిక

### రూ.97 కోట్లతో అంచనాలు

ఈ కాజ్‌వే నిర్మాణానికి 2004లోనే తొలిసారి ప్రతిపాదనలు తయారయ్యాయి. కానీ ఆ తర్వాత ముందుకు కదల్లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా కాజ్‌వే నిర్మాణానికి రూ.97 కోట్ల అంచనాతో ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రెండన్నరేళ్ల క్రితం రూ.93 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. అయితే మళ్లీ కొత్త డిజైన్ అంటూ కాజ్‌వే నిర్మాణాన్ని జాప్యం చేసింది. నెల్లూరు బ్యారేజీని ఏడు లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి వరకు డిజైన్ చేసిన క్రమంలో అదే స్థాయిలో ముదివర్తి కాజ్‌వేను కూడా నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అంచనా అంచనాలు పెరిగి రూ.184.85 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తానికి మళ్లీ అనుమతులు కోరగా, మరింత ఆలస్యమైంది. ఇక చేసేది లేక అధికారులు కూడా మొదట అనుమతులు వచ్చిన రూ.97 కోట్లతోనే తొలి దశ పనులు మొదలుపెట్టాలని భావించారు.

అనుమతులతో టెండర్లు రద్దు చేశారు. గతేడాది చివరికి గానీ టెండర్లు పూర్తి కాలేదు. ఒక కాంట్రాక్టర్ ముందుకురాగా సీవోటీ అనుమతులు వచ్చేందుకు ఆలస్యమైంది. ఆ తదుపరి అగ్రిమెంట్ చేసుకునే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎప్పుడో కాజ్‌వే నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా జాప్యం జరిగింది. ఈ కాజ్‌వేను పూర్తి చేసి తీర ప్రాంత ప్రజల కష్టాలు తీరుస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ ఏళ్లు గడిచి మళ్లీ ఎన్నికలు కూడా వచ్చేశాయి. కాజ్‌వే మాత్రం పూర్తి కాలేదు.

## ప్రచారానికీ పరిమితులున్నాయి..!



ఎన్నికల్లో పర్యావరణ చట్టాలు, నిబంధనలను నేతలంతా పాటించాలి. మైకుల గోలతో హోరెత్తిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. డీజే సౌండ్స్, పెద్ద పెద్ద స్పీకర్లతో గోల చేస్తే శబ్దకాలుష్యం కింద కేసులు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏయే ప్రాంతంలో ఎంత శబ్దం అనుమతిస్తారనే వివరాలు ఇలా ఉన్నాయి. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు జైలుశిక్ష పడే అవకాశముంది.

మోతమోగితే

ఆయా ప్రాంతాల్లో ఉండాల్సిన శబ్ద తీవ్రత. నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్, వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ మించి శబ్దం చేయరాదు.

\- ఉదయగిరి రూరల్

## తాంబూలమిచ్చి ఓట్లు అడిగేవారు.. !

నాటి ఎన్నికల్లో

నాటి ఎన్నికల ప్రచారంలో ఇన్ని ఆర్భాటాలు ఉండేవి కావు. ఎమ్మెల్యే అభ్యర్థి హంగూఆర్భాటం లేకుండా గ్రామానికి వచ్చేవారు. కొంత మంది పెద్దలతో కలసి ఓటర్లకు తాంబూలం ఇచ్చి ఓటు అడిగేవారు. అందరికీ అందుబాటులో ఉండి, ప్రజలకు సేవ చేసే వారికే ప్రజలు అప్పట్లో ఓటు వేసేవారు. మా గ్రామంలో రెండు వర్గాలు ఉండేవి. ఒక్కో వర్గానికి ఒక్కో పెద్ద ఉండే వారు. ఆ పార్టీ పెద్ద చెప్పినట్లు ఆ వర్గం ఓటర్లంతా వినేవారు. పోరుగూర్లకు వెళ్లి ఓటేయాలంటే కొందరు ఎద్ల బండిపై, మరికొందరు నడిచి వెళ్లేవారు.



\- పొత్తూరు పెంచలసుబ్బయ్య, చేజర్ల

- ఇక్కడ ఓటర్లది విలక్షణ శైలి
- వెంకయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది ఉదయగిరే..
- మైనార్టీవర్గం వ్యక్తిని గెలిపించిన ప్రాంతం

## సెగ్మెంట్ మెట్ట.. రాజకీయాల్లో దిట్ట

ముఖ చిత్రం



ఉదయగిరి దుర్గం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 23 : జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతంగా ఉదయగిరి గుర్తింపు పొందింది. కరువు ఛాయలు ఎక్కువగా కనపడేది ఇక్కడే. అయితే ఓటర్లలో రాజకీయ చైతన్యం మాత్రం ఎక్కువే. ప్రతి ఎన్నికల్లోనూ సమస్యాత్మక నియోజకవర్గం కూడా ఇదే. ఫ్యాషన్ రాజకీయాలకు అలవాలం. 1952లో ఉదయగిరి నియోజకవర్గం ఏర్పడింది. 1955లో కొంత ప్రాంతాన్ని విభజించి నందిపాడు నియో జకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి, నాగినేనిగుంట, వెలిగండ్ల ఉదయగిరిలోనూ, నందిపాడు, చినఅన్నలూరు, కనియంపాడుల తో నందిపాడు నియోజకవర్గం ఏర్పడింది. 1962 వరకూ ఇవి కొనసాగాయి. ఆ తరువాత నియోజక వర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయ గిరి, కావలిలో విలీనమైంది.

### విలక్షణమైన ఓటర్లు

నియోజకవర్గ ఓటర్లు తొలి నుంచి విలక్షణశైలి చూపుతున్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటి మద్రాసు రాష్ట్ర ఆర్థికమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డిని ఓడించారు. రాజకీయ అనుభవంలేని కోవి రామయ్యను ఆ ఎన్నికల్లో గెలిపించారు. 1955 ఎన్నికల్లో షేక్ మౌలానాసాహెబ్‌ను ఎన్నుకొన్నారు. జిల్లాలో ఆయనే తొలి మైనారిటీ ఎమ్మెల్యే. తరువాత ఏ నియోజకవర్గం లోనూ ఎన్నిక కాలేదు. 1978, 1983 ఎన్నికల్లో జనతా పార్టీ, బీజేపీల తరుపున పోటీ చేసిన వెంకయ్యనాయుడుకి పట్టం కట్టారు. ఆయన ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉదయగిరి రాజకీయ వేదికైంది. 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా కోవి రామయ్యచౌదరి, 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ మౌలానసాహెబ్, 1962లో కాం గ్రెస్ అభ్యర్థిగా పులి వెంకటరెడ్డి, 1967లో స్వతంత్ర పార్టీ అభ్య ర్థిగా ధనెంకుల నరసింహం, 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నెబోయిన చెంచురామయ్య, 1978, 1983లో జనతా, బీజేపీల తరుపున ఎం.వెంకయ్యనాయుడు, 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాదాల జానకిరాం, 1994లో ఇండిపెండెంట్‌గా, 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి గెలుపొందారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012(ఉపఎన్నిక), 2019లో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామారావులు గెలుపొందారు.

### తొలి ఎమ్మెల్యే ఖర్చు రూ.15 వేలు


ఉదయగిరి నుంచి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థి కోవి రామయ్య ఎన్నికల ఖర్చు రూ.15 వేలు మాత్రమే. అప్పట్లో ఆయన తనకున్న 12.50 ఎకరాల మాగాణిని ఎకరం రూ.1000ల చొప్పున అమ్ముకొని ఎన్నికల్లో పోటీ చేసి బెజవాడ గోపాల్‌రెడ్డిపై విజయం సాధించారు.

### మంత్రిగా ఒక్కరే..

ఉదయగిరిలో కాంగ్రెస్ పార్టీ తరుపున 1989లో తొలిసారిగా పోటీ చేసి గెలుపొందిన మాదాల జానకిరాం ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మంత్రివర్గంలో ఘనులు, భూగర్భజల శాఖ మంత్రిగా పనిచేశారు. ఉదయగిరి నుంచి ఇప్పటివరకు మంత్రి పదవి పొందింది జానకిరాం ఒక్కరు మాత్రమే.

### నందిపాడు ఎమ్మెల్యేగా వింజమూరు వాసి

1955లో నందిపాడు నుంచి వింజమూరుకు చెందిన కాశిం వెంకటరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. 1955 నుంచి 1962 వరకు ఏడేళ్లపాటు ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. 1962లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నందిపాడు ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో విలీనమైంది.




ఉదయగిరి నియోజకవర్గ మ్యాపు

**ఇప్పటి వరకు విజయం సాధించిన అభ్యర్థులు**

| సంవత్సరం | గెలిచిన వారు | పార్టీ పేరు |
|---|---|---|
| 1952 | కోవి రామయ్య | ప్రజాపార్టీ |
| 1955 | షేక్ మౌలానాసాహెబ్ | కాంగ్రెస్ |
| 1962 | పులి వెంకటరెడ్డి | కాంగ్రెస్ |
| 1967 | దనెంకుల నరసింహం | ఇండిపెండెంట్ |
| 1972 | పీ.చెంచురామయ్య | కాంగ్రెస్ |
| 1978 | ఎం.వెంకయ్యనాయుడు | జనతా |
| 1983 | ఎం.వెంకయ్యనాయుడు | బీజేపీ |
| 1985 | మేకపాటి రాజమోహన్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 1989 | మాదాల జానకిరాం | కాంగ్రెస్ |
| 1994 | కంభం విజయరామిరెడ్డి | ఇండిపెండెంట్ |
| 1999 | కంభం విజయరామిరెడ్డి | టీడీపీ |
| 2004 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2009 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2012 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | వైసీపీ |
| 2014 | బొల్లినేని వెంకటరామారావు | టీడీపీ |
| 2019 | మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి | వైసీపీ |

## ఉపాధి కల్పించేవారికే ఓటు

యువగళం



చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పార్టీకే నా ఓటు వేస్తా. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. రాష్ట్రంలోనే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నేతలు కృషి చేయాలి.కొత్తగా ఓటు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా.

\- అడపా శ్రీజిత్ జాలయ్యనాయుడు, బీటెక్ మొదటి సంవత్సరం, లింగసముద్రం



విక్రమార్కుడు...

### నాలుగోసారి పోటీ చేస్తున్నా..

కలిగిరి మండలం వీరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాపతి మధుసూదనరావు 2012 ఉపఎన్నికలతోపాటు 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా నాలుగోసారి బరిలో నిలుస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

\- కలిగిరి

## ఓయబ్బో... ఎంతప్రేమో ?







పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్ది ప్రజలపై నాయకులకు అభిమానం, ఆత్మీయతలు పెల్లుబికుతున్నాయి. వారు అభ్యర్థుల తరపున గ్రామాల్లో ఇంటింటా ప్రచారం సాగిస్తూ సామాన్యులపై చూపిస్తున్న ఆప్యాయత, అనురాగాలను చూసి పలువురు అవాక్కవుతున్నారు. అన్నా.. అక్కా... బావా, బాబాయ్... తాత, అవ్వా.. అంటూ సంబంధాలను కలుపుతూ నేతలు ఓటర్లను పిలవడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. మామీద మీకు ఇంత ప్రేమ ఉందా?.. అని ప్రజలు విస్తుపోతున్నారు. వారి నాటకాలకు అనుగుణంగా సామాన్యులు కూడా ఏమాత్రం తగ్గకుండా అదే ఆప్యాయతను కనబరుస్తున్నారు. అన్నా.. మేం కూడా మీవాళ్లమే.. మాఇంట్లో ఓటన్నీ మీకు... అంటూ చెప్పిపంపుతున్నారు. కాగా ఇప్పటికే నాయకులు కులాలు, వృత్తులు, సంఘాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆయా వర్గాల సమస్యలపై కూడా హామీలు గుప్పించారు. ఎన్నికలా.. మజాకా!

\- అనంతసాగరం

# అటెండరు రూపాయి లంచం

- నైతిక బాధ్యత వహించి మద్రాసు ప్రావిన్స్ పీఎం రాజీనామా
- నాడు నైతిక విలువలకు పెద్దపీట వేసిన చిత్తూరుజిల్లావాసి

చిరస్మరణీయులు




బొల్లిని మునస్వామి నాయుడు

తమపై వేల రూ.కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా ఇప్పటి నేతలు పదవులను పట్టుకుని వేలాడుతూనే ఉన్నారు. అక్రమాస్తుల కేసులున్నా వెరవడంలేదు. పైగా నీతి బోధనలు చేస్తున్నారు. కానీ.. తన వద్ద పనిచేసే ఒక అటెండరు రూపాయి లంచం తీసుకున్నాడని మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రి పదవికే రాజీనామా చేశారు బొల్లిని మునస్వామి నాయుడు. నాడు నైతిక విలువలు పాటించి.. నేటి తరానికీ ఆదర్శంగా నిలిచిన ఆయన చిత్తూరు జిల్లాకు చెందిన వారు. చిత్తూరు సమీపం వేపంజేరిలో 1885 ఏప్రిల్‌లో బొల్లిని మునస్వామి నాయుడు జన్మించారు. 1908లో న్యాయవాద వృత్తిలో డిగ్రీ పొందారు. సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించి మంచి పేరు పొందారు. 1920లో చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా, 1918లో 16వ చిత్తూరు మండల మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా, 1921లో చిత్తూరు మున్సిపల్ చైర్మన్‌గా, 1923 నుంచి చిత్తూరు జిల్లా బోర్డు (జిల్లా పరిషత్) అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయ సభ్యుడిగానూ కొనసాగారు. 1919-25 మధ్య మద్రాసు శాసనసభ సభ్యుడిగా, 1930లో మద్రాసు ప్రావిన్స్ ప్రధానమంత్రిగా ఎన్నికై 1934వరకు కొనసాగారు. అప్పట్లో ఈ పదవిని ప్రధానమంత్రి అనేవారు. తమ గ్రామాల సమీపంలోని అడవుల్లో పశువులు మేపుకొనేందుకు ఆయన అనుమతించారు. ఈయన ప్రధానమంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో ఓ అటెండరు రూపాయి లంచం తీసుకున్నట్లు శాసనసభలో బయటపడింది. దీనిపై విచారణ జరిపితే నిజమని తేలింది. వెంటనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి జట్కాబండిలో ఇంటికి వెళ్లారట. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించిన ఆంగ్లేయులు 1926లో 'దివాన్ బహదూర్' పురస్కారంతో సత్కరించారు.

- చిత్తూరు కలెక్టరేట్

# లెక్క చెప్పాల్సిందే...

నోట్ దిస్ పాయింట్



ఎన్నికల సమయంలో బ్యాంకులలోనే కాదు ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలపైనా ఎన్నికల అధికారులు కన్నేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా డిజిటల్ పేమెంట్లు ఎక్కువయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో బ్యాంకు ఖాతాల్లో అనూహ్యంగా నగదు బదిలీలు, పరిమితికి మించి జమ, విత్‌డ్రాలు పెరగడంతో అధికారులు నిఘా తీవ్రతరం చేశారు. ఇందుకోసం బ్యాంకు, పోలీసు, ఐటీ విభాగం, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. బ్యాంకుల్లో లక్షకు మించి డబ్బు జమ, విత్ డ్రా చేస్తే వీరు దృష్టికి వెళుతుంది. రూ.10 లక్షలు మించి లావాదేవీలు జరిగితే ఆదాయ పన్ను శాఖకు వీరె సమాచారం అందిస్తారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం స్టాండర్డ్ పొజిషన్ పద్ధతిని రూపొందించారు. దీని ప్రకారం డిపాజిట్, విత్ డ్రాలతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు డిజిటల్ చెల్లింపులన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారు. ఎక్కువ సార్లు చిన్న మొత్తాల నగదు విత్‌డ్రా లావాదేవీలను పరిశీలించే ఓ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా గ్రామీణ బ్యాంకుల్లో జీరో బ్యాలెన్సు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను సైతం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ముందు వరకూ లావాదేవీలు లేకుండా ఇప్పుడు అనూహ్యంగా పెరిగితే అందుకు కారణాలపై కూడా ఆరా తీస్తున్నారు.

- వెంకటగిరి/ డక్కిలి








# జగన్ పాగాలి కబుర్లు

- ఆరేళ్ల క్రితం ఇండస్ట్రియల్ పార్క్ పేరిట హడావిడి
- తాడేపల్లి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన
- ఐదు నెలలవుతున్నా అతీగతీ లేని ఏపీఐఐసీ
- పరిశ్రమలూ లేవు..రైతులకు పరిహారమూ లేదు
- టీడీపీ ప్రభుత్వంలోనే జరిగిన భూసేకరణ



ఏర్పేడు మండలం పాగాలి వద్ద సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ఇండస్ట్రియల్ పార్క్ బ్లాక్-2 స్థితిని తెలుపుతున్న బీడు భూములు.






పారిశ్రామిక వాడ పేరిట జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేసి గాలికొదిలేసిన వైనం అభాసుపాలైంది. టీడీపీ సేకరించిన భూముల్లోనే పరిశ్రమలొస్తున్నాయంటూ చేసిన ఆర్భాటం వైసీపీ మోసపు పోకడ తీరును బహిర్గతం చేసింది. తెలుగుదేశం హయాంలో పారిశ్రామిక పురోగతి జిల్లా ప్రజల్లో బలంగా నాటుకుందని జగన్ ప్రభుత్వం గుర్తించింది. దీంతో తామూ పరిశ్రమలను ఏర్పాటు చేయించినట్లు కలర్ ఇవ్వాలని భావించి భంగపడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

### సీఎం వర్చువల్ శంకుస్థాపన

ఏర్పేడు మండలం పాగాలి గ్రామం వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించి రెండవ బ్లాక్ ఏర్పాటుకు గతేడాది నవంబరు 23న సీఎం జగన్ తాడేపల్లి నుంచీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీలిస్తూ అరచేతిలో వైకుంఠం చూపించారు. ఈ పారిశ్రామిక వాడకు కేంద్ర పరిశ్రమల శాఖ ద్వారా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద అనుమతులొచ్చాయన్నారు. ఈ కొత్త పార్కులో 44.11 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టి మౌళిక సదుపాయాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామన్నారు. పార్కు అభివృద్ధికి కేంద్రం 70 శాతం వాటా కింద రూ. 7.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటా కింద రూ. 3.09 కోట్లు చొప్పున మొత్తం రూ. 10.33 కోట్లతో పనులు చేపడతామన్నారు. దీంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు వచ్చేస్తున్నాయని చాలామంది భావించారు.

### సీను కట్ చేస్తే..

ఐదు నెలలవుతున్నా పాగాలి పారిశ్రామికవాడ భూముల్లో అభివృద్ధి పనులు కాదు కదా ఇంతవరకూ ఏపీఐఐసీ అధికారులు కాలు కూడా పెట్టలేదు. శంకుస్థాపన నాటికి భూముల్లో రైతులు మినుము సాగు చేస్తున్నారు. నెల కిందట కోతలు పూర్తి చేశారు. ఇప్పుడా భూములు బీడుగా కనిపిస్తున్నాయి. కనీసం భూములకు సంబంధించి రైతులకు పరిహారమూ చెల్లించలేదు. అలాగని పరిశ్రమలకూ కేటాయించలేదు. పరిశ్రమలను రప్పించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఆరు నెలల్లో ఎన్నికలున్నాయని ప్రభుత్వం గత నవంబరులో హడావిడి చేసింది. జిల్లాలో టీడీపీతో పోల్చుకుని ఒక్క పరిశ్రమ కూడా రాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో సీఎం జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేశారు. అది కూడా వర్చువల్‌గా. పరిహారం రాకపోవడంతో పంగూరు బాధిత రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు. మెట్ట భూములు కావడంతో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నారు.

### టీడీపీ హయాంలోనే అంకురం

పాగాలిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో 72 ఎకరాలను సేకరించింది. ఆ భూములు పంగూరు దళితులవి. అందులో 28 ఎకరాలను రాక్‌మెన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించింది. ఆ పరిశ్రమ ఏర్పాటై ప్రస్తుతం నడుస్తోంది. ఇంకా 44 ఎకరాల భూమి మిగిలింది. గత ప్రభుత్వం సేకరించిన భూమిలో 37 ఎకరాలకు అప్పట్లోనే రైతులకు పరిహారం చెల్లించేసింది. మరో 35ఎకరాలకు రికార్డులు సక్రమంగా లేక పరిహారం చెల్లింపు పెండింగులో ఉంది.

# చంద్రబాబు పుట్టినిగడ్డ

చంద్రగిరి చరిత్ర

### టీడీపీ అధినేత రాజకీయ కేరీర్‌కు శ్రీకారం ఇక్కడే

### గల్లా అరుణకుమారి హ్యాట్రిక్ ఎమ్మెల్యే

దశాబ్దంన్నర పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడి సొంతగడ్డ చంద్రగిరి నియోజకవర్గం. ఈ నియోజకవర్గం నుంచే ఆయన రాజకీయారంగేట్రం చేశారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి ప్రాతినిధ్యం వహించారు. గల్లా అరుణకుమారి మూడుసార్లు వరుసగా కాంగ్రెస్ నుంచి గెలిచి హ్యాట్రిక్ సృష్టించారు. తిరుపతి, తిరుమల ప్రభావం కనిపించే చంద్రగిరి- ఆరంభం నుంచి ఇప్పటివరకూ పలుమార్లు పరిధులు మార్చుకుంది. 1952లో చంద్రగిరి నియోజకవర్గం జనరల్ కేటగిరిగా ఏర్పడింది. మూడేళ్ల తరువాత తవణంపల్లెగా మారింది. 1967లో బంగారుపాలెంగా మారింది. 1978లో తిరిగి చంద్రగిరి నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి, పాకాల, ఐరాల, తవణంపల్లె మండలాలతోపాటు తిరుపతి రూరల్ కొంత భాగం ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో కొంత మార్పులను సంతరించుకుని పరిధి విస్తృతం చేసుకుంది. ప్రస్తుతం చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాలెం, తిరుపతి రూరల్ మండలాలు చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నాయి.

- చంద్రగిరి

**ఎమ్మెల్యేలు**

1952 ఎ.ఆదికేశవులు నాయుడు - కాంగ్రెస్
1978 -నారా చంద్రబాబునాయుడు - కాంగ్రెస్
1983- మేడసాని వెంకటరామనాయుడు- టీడీపీ
1985 - ఎన్ఆర్ జయదేవనాయుడు- టీడీపీ
1989- గల్లా అరుణకుమారి - కాంగ్రెస్
1994- నారా రామ్మూర్తి నాయుడు -టీడీపీ
1999, 2004, 2009- గల్లా అరుణకుమారి
2014, 2019 - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి -వైసీపీ

మొత్తం ఓటర్ల సంఖ్య : 3,08,916
పురుషులు : 1,50,249
మహిళలు: 1,58,607, ఇతరులు: 60



### మా కడుపు కొట్టి లాక్కున్నారు

మా కడుపు కొట్టి పంట పండే భూమిని లాక్కున్నారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా ఈ ప్రభుత్వంలో ఎవరూ స్పందించడంలేదు. ఎవరికి చెప్పాలో తెలియక, పంటలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- చెంగమ్మ, పాగాలి

### భూముల జోలికొస్తే చావోరేవో తేల్చుకుంటాం



భూముల జోలికి వస్తే చావోరేవో తేల్చుకుంటాం. అప్పట్లో ఎకరాకు రూ.10లక్షలు పరిహారం ఇస్తామని స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో కొంతమందికి ఉద్యోగాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పరిహారం ఇవ్వలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. రైతులను మాత్రం బెదిరిస్తున్నారు.

- నాగమ్మ, పాగాలి





### పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేయం

ఏపీఐఐసీ 2018లో భూములు తీసుకుంది. పరిహారం ఇవ్వలేదు. నేటికీ ఆ భూముల్లో వర్షాధార పంటలు పండించుకుని బతుకుతున్నాం. మూడు నెలల క్రితం కొంతమంది రెవెన్యూ అధికారులు వచ్చి భూములు వదలిపెట్టాలని భయపెడుతున్నారు. ఇది ఎక్కడి న్యాయమో అర్థం కావడంలేదు. పరిహారం ఇవ్వకుండానే భూములను వదలిపెట్టమని చెప్పడం బాధాకరం.

- రంగారెడ్డి, పాగాలి

చెవిలో పువ్వు



ఫిబ్రవరి నెలలో తిరుచానూరు రైతు బజారు ప్రారంభించి కూరగాయలు కొనుగోలు చేస్తున్న మోహిత్‌రెడ్డి



గేటు తెరుచుకోని రైతు బజారు

# 1 DAY రైతుబజార్ చూశారా..

- తిరుచానూరు రైతు బజారు ఒక రోజుకే మూత
- చెవిరెడ్డి మోహిత్ దర్శకత్వంలో ఫ్లాప్ షో

ఎన్నికల వేళ అధికార పార్టీ నేతలు జనం చెవిలో పెడుతున్న పువ్వులకు తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజారు ప్రారంభమే నిలువెత్తు ఉదాహరణ. గతంలో సుమారు రూ.50లక్షలతో రైతు బజారు నిర్మించారు. 56మంది రైతులు వ్యాపారం చేసుకునేలా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతు బజారు ప్రారంభించేసి ప్రజల్లో క్రెడిట్ కొట్టేయాలనుకున్నారు చంద్రగిరి వైసీపీ నాయకులు. వెంటనే దీన్ని ప్రారంభించేయాలని తుడా చైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదరాబాదరాగా నిర్ణయించేశారు. ఇంకేముంది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆయనే స్వయంగా రిబ్బన్ కత్తిరించి రైతుబజారును ప్రారంభించేశారు. ఆ రోజు చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిపించి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయించారు. జనాలకంటే రాజకీయ నాయకులే ఎక్కువగా కొనుగోలు చేసేశారు. ఫోటోలు, వీడియోలు.. మీడియాకు గొప్పలు... అబ్బబ్బా... సినిమా షూటింగ్‌ను తలపించిందారోజు సన్నివేశం. అధిక ధరల గురించి చింతించాల్సిన అవసరం లేదు. రైతులు పంట అమ్మకం కాలేదని బాధపడాల్సిన పనిలేదు. పొలాల నుంచి నేరుగా రైతులు తెచ్చి ఈ రైతు బజారులో అమ్ముకోవచ్చు, తక్కువ ధరలకు ప్రజలు కొనుక్కోవచ్చంటూ మోహిత్ ఊదరగొట్టారు. తరువాత ఆయన అనుచరగణంతో కలిసి వెళ్లిపోయారు. రెండవ రోజుకే రైతు బజారు మూతపడింది. ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల స్టంటు అని తెలియని పరిసర ప్రాంత ప్రజలు మర్నాడు రైతు బజారు ఉందని వచ్చి ఈసురోమంటూ వెనుతిరిగారు. వైసీపీ నేతల తీరుపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. **తిరుచానూరు**


**సీన్-1**

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 14న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
కార్యక్రమం : రైతు బజారు ప్రారంభం
ప్రారంభించిన వారు : తుడా చైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**సీన్-2**

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 15న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
రైతుబజార్ పరిస్థితి : కాయగూరలూ లేవు.. విక్రయాలూ లేవు

చెంబేడు చెరువు




మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చుతాం. ఈ చెరువు పరిధిలోని గ్రామాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తాం. పంటలను సస్యశ్యామలం చేస్తాం.

2018 జనవరి 23వ తేదీన మండలంలో పాదయాత్ర నిర్వహించిన సందర్భంలో విపక్ష నేతగా జగన్ చెప్పిన మాటలివి.

# జగన్ మాట నీటి మూట

- కార్యరూపం దాల్చని చెంబేడు రిజర్వాయర్
- 10 గ్రామాలకు సాగు, తాగునీరు ప్రశ్నార్థకమే

పెళ్లకూరు, ఏప్రిల్ 23: పెళ్లకూరు మండలంలోని చిన్నా, పెద్దా చెరువుల్లో కెల్లా తలమానికం చెంబేడు చెరువు. సుమారు 832.90 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ చెరువు పరిధిలో నందిమాల, చెన్నప్పనాయుడుపేట, ఆబాకవారికండ్రిగ, నల్లగుంటకండ్రిగ, అర్థమాల, ఉమ్మలగుంట, వడ్డిపాలెం, మారినేనిపాలెం, ఆర్లపాడు, గుర్రప్పనాయుడు గ్రామాల చెరువులున్నాయి. ఈ చెరువుల కింద సుమారు 3వేల ఎకరాల వరకు సాగు భూములున్నాయి. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకుంటున్న రైతులు చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే రెండు పంటలు పండించుకోవచ్చు. అంతేకాదు సుమారు 20వేల మంది జనాభాకు తాగునీరు కూడా అందుతుందని సంబంధిత అధికారుల అంచనా.

**నిరాశే మిగిల్చారు.. :** గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పాదయాత్ర సమయంలో మండలానికి వచ్చారు.స్థానిక నాయకులతో పాటు రైతులు ఆయన్ను కలిశారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని జగన్‌ను కోరారు. దీంతో ఆయన వెంటనే మాటిచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్య తీరుస్తానన్నారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చి రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోని వచ్చాక ఆయన ఆ ఊసే పట్టించుకోలేదు. 2021లో ఈ చెరువుకు సంబంధించి రూ.31 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ అవి బుట్టదాఖలయ్యాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. చెంబేడు చెరువు మినీ రిజర్వాయర్‌గా మారుతుందన్న రైతులు ఆశలు అడియాసలయ్యాయి.వర్షం పడితే సాగు చేయడం, లేకపోతే బీడుపొలాలుగా మిగిలిపోవడం రైతులకు పరిపాటిగా మారింది.

## టీడీపీతోనే మహిళాభివృద్ధి



కరపత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి

చిల్లకూరు, ఏప్రిల్ 23: టీడీపీతోనే మహిళల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక దళిత వాడలో నానాజీ ఆధ్వర్యంలో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పాలన సాగిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. మహిళల అభివృద్ధికోసం మహాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నానాజీ, చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, దినేష్, రామ్మూర్తి, దారి రాము, సురేష్‌బాబు, రాధయ్య, మధు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తాం

### మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఏప్రిల్ 23: వైసీపీ విధ్వంసక పాలనతో విసిగి వేసారి ఆ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించి ఫ్యాన్ రెక్కలను విరిచి బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం మండలంలో మాజీ మంత్రి పరసా రత్నం, టీడీపీ అభ్యర్థి విజయశ్రీతో కలసి ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయకత్వాన్ని బలపరడానికి వైసీపీ నాయకుల తండోపతండాలుగా టీడీపీలోకి వస్తున్నారన్నారు. విజయశ్రీ మాట్లాడుతూ... తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుకు కమలం గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, ఏ.నరేంద్రరెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్, టీడీపీ పేరం రమేష్‌నాయుడు, మధుసూదన నాయుడు, కె.శివకుమార్, డి.ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో వైసీపీ ఎంపీటీసీ సభ్యుడి చేరిక



పార్టీలో చేరినవారితో ఆనం తదితరులు

బాలాయపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని కాట్రగుంట ఎంపీటీసీ సభ్యుడు మారెళ్ల రామయ్య వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ శింగంశెట్టి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆనం రామనారాయణ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. టీడీపీ విధి విధానాలు నచ్చడంతో పార్టీలో చేరానని రామయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.మురళీమోహన్‌రెడ్డి, సర్పంచు ఎం.గోపికృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వి.సురేంద్రరెడ్డి, ఏ.మహేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నతస్థాయి

గూడూరు, ఏప్రిల్ 23: చదువులతోనే సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంత ఈఈ గిరినాథ్ అన్నారు. పట్టణంలోని పూలతోటలో ఉన్న సరస్వతి శిశుమందిరంలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూకేజీ పూర్తి చేసుకుని 1వ తరగతికి వెళ్తున్న విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సత్యదేవి, మయూరి శ్యామ్‌యాదవ్, మురళీరెడ్డి, రవిచంద్ర, రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ అభ్యర్థి రామకృష్ణ నామినేషన్ నేడు



వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 23: వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉదయం 8 గంటలకు తన నివాసం నుంచి కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చేరుకుని అక్కడి స్వామి అమ్మవార్లకు, అనంతరం గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తానని చెప్పారు. అనంతరం అనంతరం పాతబస్టాండుకు చేరుకుంటానని, అక్కడ చైతన్యరథం నుంచి ప్రసంగిస్తానన్నారు. అనంతరం ర్యాలీగా వెంకటగిరి మున్సిపల్ కార్యాలయానికి ఉదయం 11.30 గంటలకు ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందిస్తానన్నారు.

## ఐదు నామినేషన్ల దాఖలు

గూడూరు అర్బన్/ సూళ్లూరుపేట, ఏప్రిల్ 23: గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం 5 నామినేషన్లు దాఖల య్యాయి. వివిధ పార్టీల అభ్యర్థులు తమ సహచరులతో కలిసి నామినేషన్ పత్రాలు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు అందజేశారు. సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

# ఇంకో ఛాన్సిస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తాడు: పాశిం

చిల్లకూరు, ఏప్రిల్ 23: ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌కు ఇంకో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తాడని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ విమర్శించారు. మంగళవారం చిల్లకూరు మండలం లోని బల్లవోలులో ప్రజాగళంయాత్రలో భాగంగా సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ దోచుకోవడం, దాచు కోవడమే పనిగా పాలన సాగిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి దళితులు, మహిళలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగాయన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు, నిత్యావసరాల వస్తుల ధరలు అమాంతం పెరిగిరిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. గాడితప్పిన పాలన ను సరైన మార్గంలో నడిపించే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. చంద్రబాబు హయాంలోనే ఐటీ అభివృద్ధి సాధ్యమైందన్నారు. టీడీపీ అండగా యువత నిలవాలన్నారు. మహిళలు, నిరుద్యోగ యువత కోసం సంక్షేమ ఫలాలను అందించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. సంపదను సృష్టించి భవిష్యత్తు తరాలకు అందించే సమర్థవం తమైన నాయకుడు ఆయనే అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.జి.లీలావతి, ఎన్.చిరంజీవి, పద్మజ, డి.కృష్ణారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, మునిశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాశిం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు

## వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని బజారువీదిలో కొలువై ఉన్న రామమందిరంలో నవమి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదాతలుగా జె.వెంకటకృష్ణారెడ్డి, చెందోటి వెంకటేశ్వర్లు, శ్రీవేమ సుధాకర్, డాక్టర్ యుగంధర్, ఎన్.రమేష్ వ్యవహరించారు.

## శాస్త్రోక్తంగా చండీయాగం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 23: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో మంగళవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా మహా చండీ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని నిర్వహించారు. శ్రీసిటీ అధినేత సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ లక్ష్యం

- తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు





ప్రజలకు అభివాదం చేస్తున్న వరప్రసాద రావు - తన భర్త వరప్రసాద్‌కు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి

తిరుపతి, (ఉపాధ్యాయనగర్/శ్రీకాళహస్తి) ఏప్రిల్ 23: అవినీతి నిర్మూలన, దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ కూటమి లక్ష్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తిరుపతి వీధుల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ అవినీతి లేని సమాజం కోసం ఎన్డీఏ పనిచేస్తుందన్నారు. అందుకే ప్రజలు ఎన్డీఏ కూటమికి విజయాన్ని అందించబోతున్నారన్నారు. తాను ఎంపీగా ఐదేళ్లు ఇక్కడ పని చేశానని, ఆ సమయంలో తాను చేసిన అభివృద్ధి పనులు తప్ప ఈ ప్రభుత్వంలో జరగలేదని స్థానికులు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి ఎలా ఉంటుందో తాను గెలిచిన తరువాత చేసి చూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి మిట్టవీధిలో గడపగడపకు తిరుగుతూ బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

### బీసీలకు అండగా ఎన్డీఏ కూటమి

బీసీలకు అండగా ఉండేది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌ను, ఎంపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి



గూడూరు, ఏప్రిల్ 23: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు కోరారు. మంగళవారం పట్టణంలోని తూర్పువీధి, ఆరుకాళ్ల మండపం వీధుల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం తమవిగా చెప్పుకుని ప్రజలను మోసం చేస్తోందన్నారు. వైసీపీ సాగిస్తున్న అరాచకపాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శ్రీనివాసులు, దయాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఆశీర్వదించండి



కోట, ఏప్రిల్ 23: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని టీడీపీ, బీజేపీ నాయకులు కోరారు. పట్టణంలోని మసీదువీధి, దాదారాయి గుంట తదితర ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... టీడీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తే వైసీపీ వచ్చిన తరువాత అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కోట మండలాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన పాశిం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. జలీల్ అహ్మద్, రాధాకృష్ణారెడ్డి, టి.సురేష్‌బాబు, నౌషాద్, షంషుద్దీన్, పోలమ్మ, పి.శ్రీనివాసులు, బీజేపీ నాయకులు రమేష్‌బాబు, పరుశురాం సాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరిలో టీడీపీ జెండా ఎగరేస్తాం

### టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ధీమా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 23: సామాన్య టీడీపీ కార్యకర్తగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తనకి వెంకటగిరి ప్రజలు తొలిసారి ఎమ్మెల్యేని చేసి రాజకీయ జన్మను ప్రసాదించారని వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... వెంకటగిరి ప్రజల చల్లని దీవెన వల్లే తాను వరుసుగా రెండు సార్లు ఎమ్మెల్యేని కాగలిగానని చెప్పారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతులు పడే కష్టాలు తెలుసన్నారు. గెలిచిన వెంటనే నియోజకవర్గంలో సాగునీటి సమస్యలపై దృష్టి పెడతానన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తాగు, సాగు నీటి ప్రాజెక్టులను ఉత్సవ విగ్రహలుగా మార్చేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అరాచకాలు, దౌర్జన్యాలు, ఇసుక, భూ దందాలు, హత్యా రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందని ఆరోపించారు. వెంకటగిరి నియోజకవర్గంలో భూ దందాలు పెరిగిపోయాయని, దేవదాయ భూములు, చెరువులు, చివరికి ఇరిగేషన్ కాలువలపై అక్రమకట్టడాలు పెరిగిపోయాయని చెప్పారు. అధికారంలోకి రాగానే వీటిపై విచారణ చేపడతానన్నారు. ఇక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వెంకటగిరిలో ఇసుక, మట్టి మాఫియా ఆగడాలు అధికమయ్యాయని చెప్పారు. ఇక వాటిని సాగనివ్వమని చెప్పారు. ప్రజలకు ఇసుక ఉచితంగా అందేవిధంగా చర్యలు తీసుకోవడం తోపాటు ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తానన్నారు. ఈ ఐదేళ్ల అవినీతి రాజ్యమేలిందని విమర్శించారు. అవినీతి ఏ రూపంలో వున్నా రూపుమాపుతానన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పారదర్శక పాలన, ప్రజలకు అవినీతి రహిత సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఇక వెంకటగిరిలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. వెంకటగిరిలో నేమలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించి తాగు నీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. వెంకటగిరిలో ఎక్కువ కుటుంబాలు చేనేతనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయని, వీరంతా చాలీ చాలని సంపాదనతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వీరికి ఉపాధి భరోసా కల్పించి చేనేత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. వీరికి ప్రత్యేక రేషన్, పట్టుమీద సబ్సిడీలు అందివ్వడమే కాకుండా వెంకటగిరిలో చేనేతల కోసం వస్త్రాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సర్పంచులను బుద్ధ విగ్రహాల్లా మార్చేసి పాలనను నిర్వీర్యం చేసేసిందన్నారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులనూ దారి మళ్లించి ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా చేసిందన్నారు. అధికారంలోకి రాగానే పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా తాగు నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ఇక వెంకటగిరి మున్సిపాల్టీని అభివృద్ధి చేసి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలుపుతానని చెప్పారు. పట్టణంలో విశాలమైన రోడ్లు, పార్కులు, క్రీడా మైదానాలు, పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయిస్తామన్నారు. వెంకటగిరిని సుందరవనంగా తీర్చిదిద్దుతానని వివరించారు. వెంకటగిరి నేతన్న నేసిన చీర దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతలు గడించాయని, వెంకటగిరిని చేనేత వ్యాపార కూడలిగా మారుస్తానని చెప్పారు. అయితే వైసీపీ పాలనలో వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు కొనసాగించలేని పరిస్థితి వెంకటగిరిలో నెలకొందన్నారు. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొందరిదే పెత్తనంగా మారింద న్నారు. ఎవరు వెంచర్లు వేయాలన్నా, అపార్టు మెంట్లు కట్టాలన్నా కప్పం కట్టే పరిస్థితి వుందని దీన్ని తాను గెలిసిన వెంటనే కట్టడి చేస్తానన్నారు. లోకేశ్, చంద్రబాబు పర్యటనల దగ్గర నుంచి అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశానన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసనలతో ప్రభుత్వాన్ని నిలదీస్తే వైసీపీ పెద్దలు తమపై హత్యాయత్నం కింద కేసులు పెట్టారని వాటిని కూడా భరించానన్నారు. గడిచిన ఐదేళ్లల్లో ఎన్నో గుణపాఠాలు నేర్చుకొన్న, తాను గెలిచాక స్వచ్ఛమైన పాలనతో పాటు, పార్టీ కార్యకర్తలు, నాయకులను తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటానాని కురుగుండ్ల రామకృష్ణ చెప్పారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి రెడ్డి, పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు చలపతి, రవి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభచాటిన విద్యార్థినులకు అభినందన



గూడూరు, ఏప్రిల్ 23: పట్టణంలోని బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో మంగళవారం పదో తరగతి ఫలితాలలో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీలను అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ... మండలంలోని విందూరు ఉన్నత పాఠశాలకు చెందిన జవహీరా(580), స్థానిక జడ్పీబాలికల పాఠశాలకు చెందిన సుధాపావన్య(564), చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అనూష(562) మార్కులు సాధించడంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.1,500 అందజేశామన్నారు. శ్రీనివాసులు, కరిముల్లా, రాము, శివకుమార్‌రెడ్డి, రసూల్, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గూడూరు, ఏప్రిల్ 23: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాణి అన్నారు. మంగళవారం గాంధీనగర్ సమీపంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలలో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఎంఈవో కాంచన, మాధురి, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టాపర్లకు అభినందన



కోట, ఏప్రిల్ 23: పట్టణంలోని పూలే బీసీ బాలుర గురుకులంలో టెన్త్‌లో 593 మార్కులు సాధించిన టి.పవన్‌ను మంగళవారం బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ కె.నారాయణరావు జ్ఞాపిక అందించి అభినందించారు. పవన్‌కు ఎంఈవో మస్తానయ్య నగదు పురస్కారం అందించారు. అదే విధంగా కోటలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులను హెచ్‌ఎం సహా ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో 93శాతం ఫలితాలు సాధించడంతోపాటూ 20 మంది విద్యార్థినులు 500 పైగా మార్కులు సాధించారు.

## నిర్భయంగా ఓటు వేయండి

కోట, ఏప్రిల్ 23: నిర్భయంగా ఓటు వేయాలని ఎంపీడీవో శంకరయ్య కోరారు. మండల పరిధిలోని కేశవరం, మద్దాలి గ్రామాల్లో మంగళవారం ఓటుపై అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఓటు ప్రాముఖ్యతను ఎంపీడీవో వివరించారు.

## టీడీపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు



ప్రసంగిస్తున్న రవి తదితరులు

వెంకటగిరి, ఏప్రిల్ 23: టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ విజయానికి ఎమ్మార్పీఎస్ పని చేస్తుందని సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవి, పట్టణ ఇన్‌చార్జి మణి చెప్పారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. వైసీపీ వల్ల మాదిగలకు జరిగిన అన్యాయాలు, అరాచకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి ఆ పార్టీకి మాదిగల సత్తా ఎమిటో చూపిస్తామన్నారు. టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ... పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మాదిగలను ఆర్థికంగా ఆదుకుంటానన్నారు.

## ఆటో ఢీకొని వృద్ధురాళ్లకు తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు వృద్ధురాళ్లు తీవ్రంగా గాయపడింది. సంజాయ్ గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలో ఉంటున్న దేవరాణి, ధనలక్ష్మి మాత్రలు కొనుగోలు చేసేందుకు రోడ్డు పక్కన వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొనింది. ఈ ప్రమాదంలో దేవరాణి, ధనలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెలవల రామయ్యకు నివాళి



నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 23: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పలువురు టీడీపీ నేతలు పరామర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం తమ్ముడు నెలవల రామయ్య(58) అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. రామయ్య మృతదేహాన్ని నాయుడుపేట పట్టణంలోని నెలవల సుబ్రహ్మణ్యం స్వగృహానికి తరలించారు. మాజీ మంత్రి పరసారత్నం, టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, చంద్రారెడ్డి, అవధానం సుధీర్ తదితరులు నెలవల కుటుంబాన్ని పరామర్శించారు.